



TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక


## ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగునీటి విస్తరణే లక్ష్యంగా సాగిన ఉన్నతస్థాయి సమావేశం..


04

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 32 | 13-06-2026 శనివారం | పేజీలు: 06 | వెల: 3/-



# బేబీ ఆర్యాంశ్‌కు సీఎం రేవంత్ అండ..

సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సాయం హామీ
ఎస్ఎమ్ఏ టైప్-2తో పోరాడుతున్న చిన్నారికి ప్రభుత్వ భరోసా
ఉత్తమ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి
సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి సాయం అందజేస్తామని ప్రకటన
ప్రాణాలను కాపాడే ఇంజెక్షన్‌కు రూ.1.5 కోట్ల అవసరం
ఇప్పటికే ప్రజల సహకారంతో రూ.75 లక్షలు సమీకరించిన తల్లిదండ్రులు
మిగిలిన నిధుల కోసం ప్రభుత్వ సహాయంపై ఆశలు
చిన్నారి పరిస్థితిని సీఎం దృష్టికి తీసుకెళ్లిన యూట్యూబర్ ఆదిరెడ్డి
సోషల్ మీడియా పోస్టుకు వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి
ఆర్యాంశ్ తల్లిదండ్రులను సంప్రదించనున్న సీఎంఆర్ఎఫ్ అధికారులు
చిన్నారి పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించిన సీఎం

హైదరాబాద్, (డిడి9 వార్త):

స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (ఎస్ఎమ్ఏ) టైప్ 2 వ్యాధితో బాధపడుతున్న ఏడాది వయసున్న చిన్నారి ఆర్యాంశ్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి A. Revanth Reddy అండగా నిలిచారు. చిన్నారికి అవసరమైన అత్యుత్తమ వైద్యం ..మిగతా 2లో

# మీనాక్షి నామినేషన్ రద్దు వెనుక రాజకీయ కుట్ర?

## ఓట్ చోరీ చేసిన బీజేపీ.. ఇప్పుడు సీట్ చోరీ చేసింది

మీనాక్షి నామినేషన్ తిరస్కరణపై రేవంత్ ఆవేదన
'ఆమెపై ఎలాంటి కేసు లేదు'
రిటర్నింగ్ అధికారి తీరుపై తీవ్ర విమర్శలు
బీజేపీకి అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణ
ముగ్గురు అభ్యర్థుల వెనుక కుట్ర ఉందా?
నితిన్ నబీన్, అధికారుల పాత్రపై అనుమానాలు
గాంధేయవాదిని అడ్డుకోవడమే లక్ష్యమా?
రాజ్యసభ ఎన్నికలపై కాంగ్రెస్ ఆగ్రహం
మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రక్రియపై ప్రశ్నలు
'మీనాక్షిని రాజ్యసభకు రానివ్వలేదు' : రేవంత్ రెడ్డి



హైదరాబాద్, (డిడి9 వార్త):

కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమైన విషయమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన ఈ అంశంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ఈ వ్యవహారంలో మీనాక్షి నటరాజన్‌కు సంబంధించి ఎలాంటి కేసు లేదని, మధ్యప్రదేశ్ రిటర్నింగ్ అధికారి తప్పుగా వ్యవహరించారని ఆరోపించారు. బీజేపీకి అనుకూలంగా రిటర్నింగ్ అధికారి పని చేశారని, రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ ముగ్గురు అభ్యర్థులను నిలబెట్టడం వెనుక కూడా కుట్ర ఉందని రేవంత్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో నితిన్ నబీన్, ఎన్నికల అధికారుల పాత్రపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. గాంధేయవాది అయిన మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు రాకుండా అడ్డుకోవడమే ఈ చర్యల వెనుక ఉద్దేశమని విమర్శించారు.
"ఇన్నాళ్లు బీజేపీ ఓట్ల చోరీ చేస్తుందని అనుకున్నాం.. ఇప్పుడు సీట్ల చోరీ కూడా చేస్తోంది" అంటూ రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి ఎఫ్ఐఆర్ లేదని, కేవలం ఒక ప్రైవేట్ ఫిర్యాదు ఆధారంగా కోర్టు నోటీసులు జారీ కావడం సాధారణ ప్రక్రియ మాత్రమేనని చెప్పారు. ఆ ఫిర్యాదులో ఉన్న వ్యక్తిగత వివాదాలకు మీనాక్షి నటరాజన్‌కు సంబంధం లేదని స్పష్టం చేశారు. బీజేపీ ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తోందని ఆరోపించిన రేవంత్, ..మిగతా 2లో

# పోటీ లేకుండానే 24 మంది రాజ్యసభకు..

ఎన్డీయేకు పెరిగిన బలం
ఈనెల 18న జరగాల్సిన ఎన్నికలకు ముందే 24 మంది ఏకగ్రీవ ఎన్నిక
మల్లికార్జున్ ఖర్గే, తరుణ్ చుగ్ తదితరులకు రాజ్యసభలో మరో అవకాశం
మొత్తం 27 స్థానాల్లో 24 స్థానాల ఫలితాల ప్రకటన
గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువపత్రాల అందజేత
రాజ్యసభలో ఎన్డీయే సంఖ్యాబలం మరింత పెరుగుదల
కాంగ్రెస్ ఖాతాలో ఐదు స్థానాలు చేరిక
వైఎస్సార్ కాంగ్రెస్‌కు మూడు స్థానాల నష్టం
ఒడిశాలో బీజేపీకి లాభించిన బీజేడీ బలం
ఏపీ, గుజరాత్‌లో ఎన్డీయే పూర్తి ఆధిపత్యం
కర్ణాటకలో కాంగ్రెస్‌కు మూడు స్థానాల విజయం

హైదరాబాద్, (డిడి9 వార్త):

రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈనెల 18న ఎన్నికలు జరగాల్సి ఉన్నప్పటికీ, పలు రాష్ట్రాల్లో పోటీ లేకపోవడంతో 24 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా పెద్దల సభకు ఎన్నికయ్యారు. మొత్తం 27 స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాగా, ఇప్పటికే 24 స్థానాలకు సంబంధించిన ఫలితాలను ఎన్నికల అధికారులు ప్రకటించారు. విజయం సాధించిన అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు ధ్రువపత్రాలను అందజేశారు.ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ తో పాటు పలువురు ప్రముఖ నాయకులు ఉన్నారు. దీంతో ఆయా పార్టీలకు రాజ్యసభలో ప్రాతినిధ్యం కొనసాగనుంది. తాజా ఎన్నికల ఫలితాలతో రాజ్యసభలో ఎన్డీయే బలం మరింత పెరిగింది. ఇప్పటికే ఉన్న స్థానాలకు తోడు ..మిగతా 2లో



# ఎన్నికల సంఘమే సుప్రీం

కాంగ్రెస్ నేత మీనాక్షీ నటరాజన్ పిటిషన్ కొట్టివేత
నామినేషన్ తిరస్కరణపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు
తదుపరి న్యాయం కోసం ఈసీఐని ఆశ్రయించడమే ఏకైక మార్గం
రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ వివాదంలో ఎదురుదెబ్బ
జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్‌కర్‌ల ఉత్తర్వులు
ఎన్నికల ప్రక్రియ నడుస్తున్న సమయంలో కోర్టులు నేరుగా జోక్యం చేసుకోలేవు
చిన్న కేసును సాకుగా చూపి నామినేషన్‌ను తోసిపుచ్చారన్న సింఘ్వీ
రెండేళ్లకు పైగా శిక్ష పడే తీవ్రమైన నేరాలను వెల్లడించాల్సి ఉంటుందని వాదన
పూర్తి పరిష్కార అధికారం ఎన్నికల సంఘానిదేనని కోర్టు వెల్లడి
న్యాయపరమైన సరిహద్దులను గుర్తుచేస్తూ పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
ఎన్నికల సంఘానికి వెళ్లాలని సూచన

హైదరాబాద్, (డిడి9 వార్త):

ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన నామినేషన్ల తిరస్కరణకు సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు శుక్రవారం ఒక చారిత్రాత్మకమైన తీర్పును వెలువరించింది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) ఏదైనా కారణంతో తిరస్కరిస్తే.. దానికి వ్యతిరేకంగా నేరుగా కోర్టులను ఆశ్రయించడం కుదరదని స్పష్టం చేసింది. తదుపరి న్యాయం మరియు సహాయం కోసం కేవలం భారత ఎన్నికల సంఘాన్ని (ఈసీఐ) ..మిగతా 2లో



# మీనాక్షి నటరాజన్ ఓటమికి కాంగ్రెస్ పార్టీ కుట్రలే కారణం

ప్రతి అంశానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేస్తోందన్న కేటీఆర్
మీనాక్షికి వ్యతిరేకంగా కొందరు కాంగ్రెస్ నేతలు వ్యవహరించి ఉండొచ్చని వ్యాఖ్య
పార్టీ ద్రోహులను రాహుల్ గాంధీ గుర్తించాలని సూచన

హైదరాబాద్, (డిడి9 వార్త):

కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అంశానికీ సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేస్తోందని, అదే విధంగా ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ అభ్యర్థిత్వానికి సంబంధించిన ..మిగతా 2లో



# సుప్రీం తీర్పు ఎదురుదెబ్బ కాదు

రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై మీనాక్షి నటరాజన్ పిటిషన్ కొట్టివేత
ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
దేశంలో ప్రజాస్వామ్యానికి ఏం జరుగుతుందో ఈ ఘటనతో వెల్లడైందని వ్యాఖ్య


హైదరాబాద్, (డిడి9 వార్త):

రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై సుప్రీంకోర్టులో చుక్కెదురైనప్పటికీ, ఇది తనకు ఎదురుదెబ్బ కాదని కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ఏం జరుగుతోందో ఈ ఘటనతో బహిర్గతమైందని ఆమె ..మిగతా 2లో



# 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం..

మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో: డీకే అరుణ
వికసిత్ భారత్ దిశగా ప్రధాని మోదీ సుదూర ప్రణాళికలు
దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాని లక్ష్యమన్న డీకే అరుణ
ప్రపంచంలో 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగిందని వ్యాఖ్య
ఉగ్రవాదంపై కేంద్రం ఉక్కుపాదం మోపుతోందన్న ఎంపీ
స్వచ్ఛ భారత్, జన్‌ధన్, జీఎస్టీతో దేశ ముఖచిత్రం మారిందని వెల్లడి
ఆర్టికల్ 370 రద్దు చారిత్రాత్మక నిర్ణయమన్న డీకే అరుణ
మహిళా సాధికారతకు కేంద్రం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని వ్యాఖ్య
2030 నాటికి 3 కోట్ల మంది మహిళలను లఖ్‌పతి, కరోడ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దే లక్ష్యం
పీఎం కిసాన్, సుకన్య సమృద్ధి పథకాలతో ప్రజలకు భరోసా
రైతులకు భారీ ఎరువుల సబ్సిడీ అందుతోందని వివరాలు



హైదరాబాద్, (డిడి9 వార్త):

2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా, 'వికసిత్ భారత్'గా నిలబెట్టాలనే మహత్తర లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ ముందుకు సాగుతున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. ప్రధాని మోదీ ..మిగతా 2లో

# మీనాక్షి నామినేషన్ రద్దు వెనుక రాజకీయ కుట్ర?

మొదటిపేజీ తరువాయి

గతంలో బీజేపీ గాడ్సే సిద్ధాంతాలను అనుసరిస్తోందని భావించామని, ఇప్పుడు ఉత్తర కొరియా తరహా రాజకీయాలను అనుసరిస్తోందనే భావన కలుగుతోందని విమర్శించారు.

**కిషన్ రెడ్డిపై మరోసారి విమర్శలు**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కూడా సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులు, నిధులు రాకుండా అడ్డుకుంటున్నది కిషన్ రెడ్డేనని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి కోసం తాము కేంద్రాన్ని కోరుతున్న సమయంలో, వాటిని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి తెలంగాణ సమస్యలపై కనీసం ఒక్క లేఖ అయినా కిషన్ రెడ్డి రాశారా అని ప్రశ్నించారు. కేంద్రంలో తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిగా రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాల్సిన బాధ్యత ఆయనపై ఉందని పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్ (RRR), హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2, ఐఆర్ఎఫ్‌సీ రుణాలు, ఇతర కీలక ప్రాజెక్టులు ఎందుకు ముందుకు సాగడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మల్కాజ్‌గిరి వరకు మెట్రో విస్తరణ విషయంలో కూడా రాజకీయ కారణాలతో అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రాజెక్టులపై కేంద్రం చొరవ చూపాలి పోలవరం ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్‌కు ఏడు మండలాలను బదిలీ చేసిన కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రాజెక్టుల కోసం అవసరమైన 1,500 ఎకరాల భూమి అంశాన్ని ఎందుకు పరిష్కరించడం లేదని రేవంత్ ప్రశ్నించారు. తెలంగాణమహారాష్ట్ర మధ్య ఉన్న ఈ అంశంపై కేంద్రం ముందుండి చొరవ తీసుకోవాలని కోరారు. తెలంగాణ అభివృద్ధి కోసం అవసరమైన ప్రాజెక్టులను కేంద్ర కేబినెట్ ముందుకు తీసుకురావాలని, అందుకు కిషన్ రెడ్డి కృషి చేయాలని సూచించారు. అవసరమైతే తెలంగాణ ప్రయోజనాల కోసం అన్ని పార్టీలు కలిసి పోరాడాలని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.





# ఎన్నికల సంఘమే సుప్రీం

మొదటిపేజీ తరువాయి

ఆశ్రయించడం ఒక్కటే ఏకైక మార్గమని కోర్టు తేల్చి చెప్పింది. రాజ్యసభ ఎన్నికల్లో తన నామినేషన్ తిరస్కరణకు గురికావడాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. రాజ్యసభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో రిటర్నింగ్ అధికారి తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన ఈ హౌస్ పిటిషన్‌ను సుప్రీంకోర్టుకు చెందిన జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా మరియు జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌లతో కూడిన ఉన్నత స్థాయి ద్విసభ్య ధర్మాసనం లోతుగా విచారించింది. ఒకసారి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయి, పోలింగ్ ప్రక్రియ మొదలైన తర్వాత అందులో న్యాయస్థానాలు నేరుగా జోక్యం చేసుకోవడానికి రాజ్యాంగబద్ధంగా కొన్ని పరిమితులు ఉంటాయని న్యాయమూర్తులు ఈ సందర్భంగా గుర్తు చేశారు. రిటర్నింగ్ అధికారి తీసుకున్న నిర్ణయంలో ఒకవేళ ఏవైనా లోపాలు లేదా తప్పులు ఉన్నట్లు భావిస్తే.. దాన్ని సరిదిద్దే పూర్తి బాధ్యత, పరిష్కార యంత్రాంగం కేవలం ఎన్నికల సంఘం పరిధిలోనే ఉంటాయని ధర్మాసనం స్పష్టం చేసింది.

విచారణ సందర్భంగా ధర్మాసనం పిటిషనర్ తరఫు న్యాయవాదులకు ఒక సూటి ప్రశ్నను సంధించింది. దేశంలో దేశవ్యాప్త లేదా రాష్ట్రస్థాయి ఎన్నికల ప్రక్రియ అధికారికంగా నడుస్తున్న దశలో.. సుప్రీంకోర్టు మధ్యలో జోక్యం చేసుకుని నామినేషన్లను పునరుద్ధరించిన దాఖలాలు గానీ, లేదా గతంలో వెలువడిన తీర్పులు (Precedents) ఏవైనా ఉంటే తమ ముందు చూపించాలని కోర్టు కోరింది. ఎన్నికల నిర్వహణ అనేది పూర్తిగా స్వతంత్ర అథారిటీ అయిన ఎన్నికల సంఘం పరిధిలోని అంశమని, అందువల్ల షెడ్యూల్ నడుస్తున్నప్పుడు తాము సమాంతరంగా ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేమని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు.

కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ తరఫున దేశంలోని ప్రముఖ సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కోర్టులో తన పటిష్టమైన వాదనలను వినిపించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమపై ఉన్న అన్ని రకాల కేసులను అఫిడవిట్ లో పెట్టాల్సిన అవసరం లేదని ఆయన కోర్టుకు వివరించారు. చట్ట ప్రకారం కేవలం రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం జైలు శిక్ష పడే అవకాశం ఉన్న తీవ్రమైన నేరపూరిత (క్రిమినల్) కేసులను మాత్రమే అభ్యర్థులు తమ నామినేషన్ అఫిడవిట్‌లో అధికారికంగా వెల్లడించాల్సి ఉంటుందని సింఘ్వీ చట్టంలోని నిబంధనలను ధర్మాసనం ముందు చదివి వినిపించారు.

ప్రస్తుత కేసులో పిటిషనర్ మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి తీవ్రమైన క్రిమినల్ కేసులు లేవని, ఆమెకు కనీసం కోర్టు ద్వారా శిక్ష కూడా పడలేదని న్యాయవాది సింఘ్వీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేవలం ఒక చిన్న సాధారణ వివాదానికి సంబంధించి స్థానిక కోర్టు నుండి ఆమెకు కేవలం ప్రాథమిక సమన్లు మాత్రమే జారీ అయ్యాయని తెలిపారు. ఈ విషయాన్ని ఒక పెద్ద నేరంగా చిత్రీకరిస్తూ, దీనినే సాకుగా చూపి రిటర్నింగ్ అధికారి అత్యంత తప్పుగా మరియు ఏకపక్షంగా ఆమె రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించారని వాదించారు. ఆర్ఓ తీసుకున్న ఈ తప్పుడు నిర్ణయం వల్ల ఒక అర్హత కలిగిన అభ్యర్థి పోటీ చేసే అవకాశాన్ని కోల్పోతున్నారని, అందువల్ల ఈ దశలో కోర్టు జోక్యం చేసుకోవడం అత్యంత అవసరమని సింఘ్వీ కోరారు.

పిటిషనర్ తరఫు న్యాయవాది సింఘ్వీ వినిపించిన వాదనలను విన్నప్పటికీ.. ఈ రన్నింగ్ స్టేజ్‌లో తాము రిటర్నింగ్ అధికారి ఆదేశాలపై స్టే ఇవ్వలేమని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం తేల్చి చెప్పింది. చట్టప్రకారం నామినేషన్ల స్క్రూటినీ (పరిశీలన) సమయంలో లోపాలు దొర్లితే దానికి వేరే వేదికలు ఉన్నాయని పేర్కొంది. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడానికి కోర్టుల దూరంగా ఉండటమే మంచిదని భావిస్తూ.. మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు అర్హత లేనిదిగా భావిస్తూ పూర్తిగా కొట్టివేసింది. ఈ దశలో తాము ఇచ్చే ఎలాంటి ఆదేశాలైనా ఎన్నికల షెడ్యూల్‌ను ప్రభావితం చేస్తాయని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు.

పిటిషన్‌ను కొట్టివేసినప్పటికీ.. బాధితురాలికి న్యాయం జరిగే తలుపులు పూర్తిగా మూసుకుపోలేదని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరాలు ఉంటే.. తక్షణమే కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించి అక్కడ తమ అభ్యర్థనను రికార్డు చేసుకోవాలని ద్విసభ్య ధర్మాసనం పిటిషనర్‌కు కీలక సూచన చేసింది. రిటర్నింగ్ అధికారి చేసిన తప్పులను నిరూపించడానికి అవసరమైన ఆధారాలను ఈసీఐ ముందే ఉంచి న్యాయం పొందవచ్చని పేర్కొంది. ఒకవేళ అక్కడ కూడా అనుకూల నిర్ణయం రాకపోతే.. ఎన్నికల ప్రక్రియ మొత్తం ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం 'ఎన్నికల పిటిషన్' ద్వారా హైకోర్టును ఆశ్రయించే హక్కు అభ్యర్థికి ఎలాగో ఉంటుందని గుర్తు చేసింది.

సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన ఈ తీర్పు కేవలం ఈ ఒక్క రాజ్యసభ కేసుకే పరిమితం కాకుండా.. దేశవ్యాప్తంగా జరిగే అన్ని రకాల లోక్‌సభ, అసెంబ్లీ మరియు పెద్దల సభ ఎన్నికలకు ఒక గైడ్‌లైన్‌గా మారనుంది. నామినేషన్ల తిరస్కరణకు గురైన ప్రతిసారీ అభ్యర్థులు నేరుగా హైకోర్టులను, సుప్రీంకోర్టును ఆశ్రయించి స్టేలు తెచ్చుకోవడం వల్ల ఎన్నికల ప్రక్రియలు ఆలస్యమవుతున్నాయనే వాదనకు ఈ తీర్పుతో అడ్డుకట్ట పడనుంది. ఇకపై ఎలాంటి నామినేషన్ల గొడవలు ఉన్నా.. అభ్యర్థులు ముందుగా ఎన్నికల సంఘం చుట్టూనే తిరగాల్సి ఉంటుందని, పోలింగ్ ముగిసేవరకు కోర్టులు ఇలాంటి విషయాల్లో తలదూర్చవని ఈ తీర్పు ద్వారా స్పష్టమైంది.

# మీనాక్షి నటరాజన్ ఓటమికి కాంగ్రెస్ పార్టీ కుట్రలే కారణం

మొదటిపేజీ తరువాయి

వివాదంపైనా సిట్ విచారణ జరపాలని వ్యంగ్యం ప్రదర్శించారు.

మీనాక్షి నటరాజన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లోనే కొందరు నాయకులు వ్యవహరించి ఉండవచ్చని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లింది కూడా కాంగ్రెస్ వర్గాలేనని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత విభేదాలు, వర్గపోరాటాలే ఈ పరిస్థితులకు కారణమని పేర్కొన్నారు. పార్టీ ద్రోహులు ఎవరో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించాలని సూచించారు.

తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై కూడా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఉన్న హైదరాబాద్ నగర సమస్యలను పరిష్కరించకుండా భవిష్యత్ నగరాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. తాజాగా కురిసిన వర్షాలతో నగరంలో ఏర్పడిన పరిస్థితులు ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టాయని వ్యాఖ్యానించారు.



అలాగే, కేంద్రం తీసుకురానున్న డీలిమిటేషన్ ప్రక్రియపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గేలా నిర్ణయాలు తీసుకుంటే బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# సుప్రీం తీర్పు ఎదురుదెబ్బ కాదు

మొదటిపేజీ తరువాయి

వ్యాఖ్యానించారు. రాజ్యాంగ సంస్థలపై గౌరవం ఉందని, అందుకే కోర్టు తీర్పుపై నేరుగా స్పందించనని తెలిపారు.

ఈ పరిణామం తనను షాక్‌కు గురిచేయలేదని మీనాక్షి నటరాజన్ అన్నారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై తమకు నమ్మకం లేదని, అయితే తమ న్యాయపరమైన వాదనలో ఎలాంటి బలహీనత లేదని ఆమె పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు వేసిన తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎస్. చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. నామినేషన్ తిరస్కరణకు గురైన తర్వాత, ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. దీనిపై ఎన్నికల సంఘంలో పిటిషన్ ద్వారానే పరిష్కారం వెతుక్కోవాలని సూచించింది.



2022లో తెలంగాణలో నమోదైన ఒక క్రిమినల్ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో జూన్ 9న రిటర్నింగ్ అధికారి ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. అయితే, రెండేళ్లకు పైగా శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల వివరాలు మాత్రమే వెల్లడించాల్సి ఉంటుందని, ఈ కేసులో కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని ఆమె తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు.

# పోటీ లేకుండానే 24 మంది రాజ్యసభకు..

మొదటిపేజీ తరువాయి

మరో మూడు స్థానాలు అదనంగా దక్కడంతో కూటమి సంఖ్యాబలం పెరిగింది. కాంగ్రెస్ ఐదు స్థానాలు గెలుచుకున్నప్పటికీ, మొత్తం బలంలో పెద్దగా మార్పు చోటుచేసుకోలేదు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ మార్పుల ప్రభావం ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. గతంలో అధిక స్థానాలు కలిగి ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాలను కోల్పోయింది. దీంతో రాజ్యసభలో ఆ పార్టీ ప్రాతినిధ్యం తగ్గింది. మరోవైపు ఒడిశాలో బిజూ జనతాదళ్‌కు చెందిన నాయకులు బీజేపీ వైపు రావడంతో అక్కడ కూడా కమలనాథులకు లాభం చేకూరింది.

ఒడిశా నుంచి బీజేపీ అభ్యర్థి దేబాశిష్ సమంతరాయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవలే బీజేడీని వీడి బీజేపీలో చేరిన ఆయన తిరిగి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

రాష్ట్రాల వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు స్థానాలను ఎన్డీయే కైవసం చేసుకుంది. గుజరాత్‌లో కూడా నాలుగు స్థానాలన్నీ కూటమి ఖాతాలో పడ్డాయి. మధ్యప్రదేశ్‌లో మూడు స్థానాలన్నీ బీజేపీ గెలుచుకోగా, రాజస్థాన్‌లో మూడు స్థానాల్లో రెండు స్థానాలను కమలదళం దక్కించుకుంది. కర్ణాటకలో కాంగ్రెస్ మూడు స్థానాలు గెలుచుకుని ఆధిక్యం చాటుకోగా, బీజేపీ ఒక స్థానంతో సరిపెట్టుకుంది. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్ రాష్ట్రాల్లోని ఒక్కో స్థానాన్ని బీజేపీ దక్కించుకుంది. మేఘాలయలో ఎన్డీయే భాగస్వామ్య పక్షమైన ఎన్‌పీపీ ఒక స్థానాన్ని గెలుచుకుంది. మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో ఒక్కో స్థానాన్ని ఎన్డీయే గెలుచుకోగా, తమిళనాడులో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. మొత్తం మీద తాజా రాజ్యసభ ఎన్నికల ఫలితాలు ఎన్డీయేకు ఊతమివ్వగా, కొన్ని ప్రాంతీయ పార్టీల ప్రాతినిధ్యంపై ప్రభావం చూపినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం..

మొదటిపేజీ తరువాయి

నాయకత్వంలో దేశం చారిత్రాత్మక మైలురాళ్లను అధిగమిస్తూ ప్రపంచ వేదికపై తన ప్రత్యేక స్థానాన్ని మరింత బలపరుచుకుంటోందని ఆమె అన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడిన డీకే అరుణ, దేశ అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగానే భారతదేశం ప్రపంచంలో నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని పేర్కొన్నారు.

ఆర్థిక రంగంలోనే కాకుండా జాతీయ భద్రత విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం రాజీ పడకుండా ముందుకు సాగుతోందని డీకే అరుణ తెలిపారు. దేశ భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఉగ్రవాద కార్యకలాపాలపై కేంద్రం కఠిన వైఖరి అవలంబిస్తోందని, దేశ సమగ్రతకు ముప్పు కలిగించే శక్తులపై ఉక్కుపాదం మోపుతోందని చెప్పారు.

ప్రధాని మోదీ పాలనలో అమలైన పలు కీలక పథకాలు, నిర్ణయాలను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. స్వచ్ఛ భారత్ మిషన్, జన్‌ధన్ యోజన, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలు, ట్రిపుల్ తలాక్ రద్దు, జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు వంటి నిర్ణయాలు దేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో గణనీయమైన మార్పులకు దారితీశాయని అభిప్రాయపడ్డారు.

మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న డీకే అరుణ, 2030 నాటికి దేశవ్యాప్తంగా 3 కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి దీదీలు', 'కరోడ్‌పతి దీదీలు'గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తోందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాల ద్వారా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

రైతు సంక్షేమానికి కూడా కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆమె పేర్కొన్నారు. పీఎం కిసాన్, సుకన్య సమృద్ధి వంటి పథకాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని అన్నారు. ముఖ్యంగా రైతులకు ఎరువులపై కేంద్రం భారీ సబ్సిడీ అందిస్తోందని, ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.24 వేల వరకు పరోక్ష రాయితీ లభిస్తోందని వివరించారు.

దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా, సాంకేతికంగా మరింత బలోపేతం చేస్తూ 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని డీకే అరుణ తెలిపారు. ప్రజల సహకారం, భాగస్వామ్యంతో 'వికసిత్ భారత్' స్వప్నం సాకారం అవుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.





# బేబీ ఆర్యాంశ్‌కు సీఎం రేవంత్ అండ..

మొదటిపేజీ తరువాయి

అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించారు.

తెలంగాణకు చెందిన ఆర్యాంశ్ అరుదైన జన్యుపరమైన వ్యాధి అయిన ఎస్ఎంఏ టైప్ 2తో బాధపడుతున్నాడు. చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు అత్యంత ఖరీదైన ప్రత్యేక ఇంజెక్షన్ అవసరమని వైద్యులు సూచించారు. ఈ ఇంజెక్షన్ కోసం సుమారు రూ.1.5 కోట్ల వ్యయం అవుతుందని తెలుస్తోంది. ఆసుపత్రి వైద్యుల సూచనల మేరకు జూన్ 20లోపు ఇంజెక్షన్ స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉండగా, జూలై నెలాఖరులోగా చికిత్స పూర్తి చేయాల్సి ఉంది.

చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు తల్లిదండ్రులు ప్రజల సహకారం కోరగా, దాతల నుంచి విశేష స్పందన లభించింది. ఇప్పటివరకు సుమారు రూ.75 లక్షలు సమీకరించగలిగారు. అయితే చికిత్స పూర్తిచేయడానికి మరో రూ.75 లక్షలు అవసరమవుతుండటంతో మిగిలిన నిధుల కోసం ప్రభుత్వ సహాయంపై ఆశలు పెట్టుకున్నారు.

చిన్నారి ఆరోగ్య పరిస్థితి, చికిత్సకు అవసరమైన భారీ నిధుల విషయాన్ని ప్రముఖ యూట్యూబర్ ఆదిరెడ్డి సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, చిన్నారికి అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

"చిన్నారి ఆర్యాంశ్‌కు ఉత్తమ చికిత్స అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. సీఎంఆర్ఎఫ్ అధికారులు తల్లిదండ్రులను సంప్రదిస్తారు. ఆర్యాంశ్ పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని సీఎం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ అధికారులు వెంటనే చిన్నారి కుటుంబ సభ్యులను సంప్రదించి అవసరమైన వివరాలు సేకరించనున్నారు. సీఎం స్పందనతో చిన్నారి కుటుంబంలో ఆశలు చిగురించగా, ఆర్యాంశ్ త్వరగా కోలుకోవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

# నీట్‌యూజీ పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలు

**నిజామాబాద్ జిల్లా, జూన్ 12(డీడీ9 వార్త) :**

ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న నీట్ యూజీ 2026 రీఎగ్జామినేషన్‌ను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మేరకు ఇంచార్జి పోలీస్ కమిషనర్, కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం.రాజేశ్ చంద్ర వివరాలను వెల్లడించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఇద్దరికి మించి గుంపులుగా చేరడాన్ని పూర్తిగా నిషేధించారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు మరియు స్టేషనరీ దుకాణాలను పరీక్ష సమయాల్లో తప్పనిసరిగా మూసివేయాలని యజమానులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలు సజావుగా సాగేందుకు ప్రతి కేంద్రం వద్ద ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతామని కమిషనర్ పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులందరూ ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాసి మంచి ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.




నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ కాలేజీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, నాగారంలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, డిచ్‌పల్లిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కాలేజీ, బోధన్‌లోని ప్రభుత్వ జూనియర్ మరియు డిగ్రీ కాలేజీలతో పాటు మాక్లూర్‌లోని శ్రీ బిగాల కృష్ణమూర్తి జెడ్పీహెచ్ఎస్ కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

# తాలిపేరు ఎడమ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలి...

- **ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**
- **జిల్లా కలెక్టర్ అంకిత్..**

**జూన్ 12 డిడి 9 వార్త దుమ్ముగూడెం**

దుమ్ముగూడెం మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి తాళిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువతో పాటు దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాగునీటి సరఫరా, వైద్య సేవల నిర్వహణపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

మొదటగా వీరభద్రపురం గ్రామం పరిధిలోని తాళిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువను పరిశీలించిన కలెక్టర్, కాలువ పరిస్థితులు, నీటి ప్రవాహం, ఆయకట్టు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాళిపేరు ప్రాజెక్టు ద్వారా సుమారు 24,700 ఎకరాల భూమికి సాగునీరు అందుతుండగా, ఎడమ కాలువ 46.46 కిలోమీటర్ల పొడవుతో 34 డిస్ట్రిబ్యూటరీల ద్వారా సుమారు 21,100 ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. కాలువలో పెరిగిన గడ్డి, చెత్త, పూడికను వెంటనే తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు సాగునీరు సకాలంలో అందేలా కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయకట్టు చివరి భూముల వరకు నీరు చేరేలా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

అనంతరం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆరోగ్య కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవల నిర్వహణపై సమగ్రంగా ఆరా తీశారు. ఇన్‌పేషెంట్ వార్డును సందర్శించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలు, సేవల నిర్వహణను పరిశీలించారు. ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం వచ్చిన విద్యార్థులతో మాట్లాడి వారి వివరాలను తెలుసుకున్న కలెక్టర్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీకి అనుసరిస్తున్న విధానంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఔషధ నిల్వల గదిని పరిశీలించి మందుల నిల్వలు, అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. అలాగే ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ రిజిస్టర్లు, ఇతర వైద్య రికార్డులను పరిశీలించారు. పాముకాటు, తేలు కాటుకు గురైన రోగులకు అవసరమయ్యే అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాముకాటుకు గురైన వ్యక్తికి అందించే చికిత్స విధానం, అనుసరించే వైద్య ప్రోటోకాల్‌పై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రైతులకు సాగునీరు సకాలంలో అందించేందుకు కాలువల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని, అలాగే ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సత్వర వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ అశోక్ కుమార్ ఇరిగేషన్ ఈ ఈ జానీ, డాక్టర్ రుక్మాకర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు...





## నూతన కోర్టు భవనం నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు

**నిజామాబాద్ జిల్లా, జూన్ 12(డీడీ9 వార్త) :**

భీంగల్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న నూతన కోర్టు భవనానికి ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఉండేందుకు స్థానిక కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్ తన సొంత ఖర్చులతో చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్న తరుణంలో భవనం పైభాగం మరియు పరిసరాల్లో విస్తరించి ఉన్న పెద్ద చెట్ల కొమ్మలు భవిష్యత్తులో ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని గుర్తించిన లక్ష్మణ్ ఈ ముందస్తు జాగ్రత్త చర్య చేపట్టారు. వర్షాకాలంలో బలమైన గాలులు, వర్షాల కారణంగా ఈ కొమ్మలు విరిగి భవనంపై పడే ప్రమాదం ఉండటంతో పాటు నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు మిషనరీ సహాయంతో వీటిని తొలగించారు. కోర్టు భవన పరిసరాలు పరిశుభ్రంగా, సురక్షితంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన న్యాయ సేవలు అందించే ఈ భవన నిర్మాణం ఎటువంటి అంతరాయం లేకుండా పూర్తి కావాలనే సదుద్దేశంతోనే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు మల్లెల లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గజ్జెల చైతన్య, సురేష్, వాక మహేష్, చెప్పాల గణేష్, తోట సతీష్, అంజుమాలి, సంధ్య నాయక్, పల్లె శేఖర్, ముచ్చుర్ లింబాద్రి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు జనార్ధన్, పట్టణ అధ్యక్షుడు పర్స అనంతరావు, జుబేర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. నూతన కోర్టు భవనం నిర్మాణానికి సహకరిస్తున్న మల్లెల లక్ష్మణ్ పాల్గొన్న ప్రతి ఒక్కరినీ స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.



## విద్యాసంస్థపై బెదిరింపులకు పాల్పడిన విద్యార్థి సంఘం నాయకుడిపై కేసు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 12(డీడీ9 వార్త) :**

విద్యాసంస్థను బెదిరిస్తూ, డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు యాజమాన్యంపై దుష్ప్రచారానికి పాల్పడుతున్న విద్యార్థి సంఘం నాయకుడు నాగరాజుపై బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదుదారు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్‌లోని చైతన్య వోకేషనల్ కాలేజీని సజావుగా నడుపుకోవాలంటే తనకు డబ్బులు చెల్లించాలంటూ నాగరాజు గత ఆరు నెలలుగా యాజమాన్యాన్ని తీవ్రంగా వేధిస్తున్నాడు. యాజమాన్యం లంచం ఇచ్చేందుకు నిరాకరించడంతో నాగరాజు కక్ష పెంచుకుని, కాలేజీ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా సోషల్ మీడియా వేదికల్లో తప్పుడు సందేశాలను ప్రచారం చేస్తున్నాడు. ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరిస్తూ యాజమాన్యాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై స్పందించిన బోధన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ, విద్యార్థి సంఘాల పేరుతో విద్యాసంస్థలను బెదిరించి వసూళ్లకు పాల్పడే చర్యలను పోలీస్ శాఖ తీవ్రంగా పరిగణిస్తుందని హెచ్చరించారు. ఈ కేసుపై ఇప్పటికే సమగ్ర విచారణ ప్రారంభించామని, నిందితుడిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇలాంటి బెదిరింపులు, వసూళ్లకు గురయ్యే విద్యాసంస్థలు తక్షణమే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

## బోధన్ శ్రీ చక్రేశ్వర శివాలయంలో పూజా సామాగ్రి దుకాణాల లీజు వేలం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 12(డీడీ9 వార్త) :**


బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయంలో కొబ్బరికాయలు, పూజా సామాగ్రి విక్రయించే దుకాణాల కోసం శుక్రవారం ఉదయం బహిరంగ లీజు వేలం పాటను నిర్వహించారు. రెండేళ్ల కాలపరిమితికి గాను నిర్వహించిన ఈ వేలంలో నలుగురు వ్యక్తులు డిపాజిట్ చెల్లించి వేలం ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ పోటీలో బోధన్‌లోని దేవీగల్లికి చెందిన జి.రాజు సంవత్సరానికి రూ.1 లక్ష 50 వేల చొప్పున రెండు సంవత్సరాలకు మొత్తం రూ.3 లక్షలకు అత్యధిక పాట పాడి దుకాణాల లీజును దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాములు, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుజాతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెల14న జానంపేటలో జానపద కళా ఉత్సవాలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 12(డీడీ9 వార్త) :**

ప్రజా నాట్యమండలి బోధన్ రూరల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 14న (ఆదివారం) జానంపేట గ్రామపంచాయతీ వద్ద జానపద కళా ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఏరియా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజా నాట్యమండలి ఆదేశాల మేరకు ఈ కళా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న ఈ ఉత్సవాల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన దాదాపు వంద మంది కళాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటనున్నారని వివరించారు. ఈ కళా ప్రదర్శనల్లో భాగంగా గొబ్బియాలు, కోలాటం, శాస్త్రీయ నృత్యం, కూచిపూడి, ఆంధ్ర నాట్యం, మహిళలచే గురుబోధ కార్యక్రమాలు, భజన బృంద గానలహరి, సంగీత విభావరి, జానపద గేయాలు తదితర కళారూపాలను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయడానికి కళాకారులు, కళాభిమానులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, విద్యార్థులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నర్సారెడ్డి కోరారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు దారం పోతన్న, సిర్ప లింగం తదితరులు పాల్గొన్నారు.



## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**నిజామాబాద్ జిల్లా, జూన్ 12(డీడీ9 వార్త) :**

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాల కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని నెహ్రూ పార్క్ చౌరస్తా వద్ద గల లేబర్ అడ్డాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో చేర్చుకోకుండా, బడులకు పంపి విద్యను అందించడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని స్పష్టం చేశారు. నేటి బాలలే రేపటి పౌరులని, ఒక చిన్న మొక్కను వృక్షంగా తీర్చిదిద్దినట్లుగా పిల్లల ఆరోగ్యం, ఆలోచనా విధానం, భవిష్యత్తుపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కల్పించడంతో పాటు, దినసరి కూలీలకు ప్రభుత్వ లేబర్ స్కీములు, ఇన్సూరెన్స్ ప్రయోజనాలు మరియు లేబర్ కార్డుల ఆవశ్యకతపై వివరించారు. లేబర్ కార్డు లేని వారందరూ వాటిని పొంది ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయశాఖ లీగల్ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదారి, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఉదయ్ కృష్ణ, లీగల్ రిపోర్టర్ మాణిక్ రాజ్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు చైతన్య కుమార్, సాధన ఎన్జీవో సంస్థ ప్రతినిధులు మధుసూదన్, వినేష్, నిరీక్షణ, గంగాధర్, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.




## ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 12(డీడీ9 వార్త) :**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున, వానాకాలం పంటల సాగుపై ప్రభుత్వం రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం సాలూర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాతో పాటు బోధన్ డివిజన్ ప్రాంత రైతులు ఎప్పటిలాగే సాగుకు సిద్ధమవుతున్నారని, అయితే వర్షాభావ పరిస్థితులు తలెత్తితే భారీ నష్టాలను చవిచూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందో రైతులకు సూచించడంతో పాటు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను ప్రభుత్వమే సబ్సిడీపై అందించాలని ఆయన కోరారు. పంటలు పండిన తర్వాత గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తామనే భరోసా కల్పించాలని, రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జి.దేవయ్య, సి.హెచ్.రమేష్, ఎస్.లక్ష్మయ్య, ఆర్.నాగేష్, లక్ష్మణ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

**డీఎంహెచ్ఓ**

**నిజామాబాద్ జిల్లా, జూన్ 12(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ నగరంలోని చంద్రశేఖర్ నగర్ కాలనీలో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.రాజశ్రీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కేంద్రంలోని ఉద్యోగుల హాజరు, ఓపీ రిజిస్టర్లు, మందుల నిల్వలు మరియు ఇతర రికార్డులను పరిశీలించారు. వ్యాక్సిన్‌ల నిల్వకు సంబంధించి ఐఎల్ఆర్ లో ఉష్ణోగ్రతలను క్రమం తప్పకుండా నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలందరినీ 12 వారాల లోపు తప్పనిసరిగా నమోదు చేయాలని, హైరిస్క్ గర్భిణీలను గుర్తించి వారికి ప్రత్యేక ప్రసవ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉద్యోగులందరూ విధిగా సమయపాలన పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించి విధులకు గైర్హాజరయ్యే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపకేంద్రాల పరిధిలో నిర్దేశించిన లక్ష్యాలను నూటికి నూరు శాతం పూర్తి చేయాలని, అసంపూర్తిగా ఉన్న రికార్డులన్నింటినీ వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్రంలో నిరంతరం పరిశుభ్రత పాటించాలని సూచించిన ఆమె, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ తనిఖీలో వైద్యాధికారి డాక్టర్ కీర్తి, నర్సింగ్ అధికారులు నేహా, అర్చన తదితరులు పాల్గొన్నారు.



## బోధన్ పట్టణంలో నేడు రెండు గంటల పాటు విద్యుత్ నిలిపివేత

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 12(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. సబ్ స్టేషన్ నిర్వహణ పనుల్లో భాగంగా 33/11 కేవీ బోధన్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని కాలనీల్లో ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ నాయిని కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనులకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



## అమ్దాపూర్‌లో నూతన మహిళా భవన నిర్మాణానికి భూమిపూజ

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 12(డీడీ9 వార్త) :**

అమ్దాపూర్‌లో గ్రామంలోని మహిళల చిరకాల కోరిక మేరకు నూతన మహిళా భవన నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సహకారం, సర్పంచ్ పోరెడ్డి గంగాధర్ ప్రత్యేక కృషితో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పీసీసీ డెలిగేట్ గంగ శంకర్, సంజీవ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సాధికారతకు, వారి అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అందులో భాగంగానే గ్రామంలో భవనాన్ని నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రుమ్మాజీ, వార్డు సభ్యులు జయ, సుమలత, కూనింటి రాజు, నర్రా సుధాకర్, సమీరుద్దీన్, గ్రామ పెద్దలు జాయ నాగన్న, బొర్ర పల్లన్న, నవత్ నాగిరెడ్డి, మారుతి, గణపతి, శంకర్, రాము, కాంగ్రెస్ పార్టీ నాయకులు రఫీ, ఖాజా, సతీష్, కార్యదర్శి రంజిత్, ఐకేపీ సిబ్బంది దీప, సీఏ అంజలి, మహిళా సంఘం అధ్యక్షురాలు కవితతో పాటు స్థానిక మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నర్సాపురం హైస్కూల్లో అడ్మిషన్లు జరుగుచున్నవి

- **ప్రధాన ఉపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు**

**జూన్ 12 డీడీ 9వార్త దుమ్ముగూడెం**



దుమ్ముగూడెం మండలం, నర్సాపురం గ్రామం లోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల లో 6వ తరగతి నుండి 10 వ తరగతి వరకు ఇంగ్లీష్ తెలుగు మీడియం లలో అడ్మిషన్ లు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలియచేశారు. ప్రభుత్వ పాఠశాల లో చదవడం మీ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు పునాది రాళ్లు అని బెక్కంటి అన్నారు.
పాఠశాలలో గత రెండు సంవత్సరాలనుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో వంద శాతం ఫలితాలు సాధించటమే కాకుండా ఈ సంవత్సరము 542 మార్కులతో మండల నియోజకవర్గ స్థాయిలో టాపర్ గా 500 పైన మార్కులు 16 మంది విద్యార్థులు సాధించారని, ఈ పాఠశాల నుండి ఐ ఐ టి బాసర లో సీట్లు సాధించటమే కాకుండా ఈ సంవత్సరము ముగ్గురు విద్యార్థులు ఎన్ ఎం ఎం ఎస్2025 లో జాతీయస్థాయిలో కూడా స్కాలర్ షిప్ సాధించటం జరిగింది అని తెలియచేశారు. పాఠశాలలోని వసతుల గురించి తెలియచేస్తూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన, నాణ్యమైన రుచికరమైన భోజనం, రాగి జావా, ఉడికించిన కోడిగుడ్లు, పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందించడం జరుగుతుందని వీటితోపాటు కంప్యూటర్ విద్య, డిజిటల్ తరగతుల నిర్వహణ, అన్ని వనరులతో లైబ్రరీ, సైన్స్ ల్యాబ్ వంటి వసతులు కల్పించబడుతున్నాయి అని తెలియచేసారు. అంతే కాకుండా ప్రతి విద్యార్థికి ఉచితంగా రెండు జతల స్కూల్ యూనిఫామ్, బూట్లు, బెల్టు, స్కూల్ బ్యాగు, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందించబడతాయని ,విశాలమైన పాఠశాల ఆవరణ, ఆట స్థలం, విద్యార్థిని విద్యార్థులకు వేరువేరుగా మరుగుదొడ్ల సదుపాయం మొదలైన వసతులు కల్పిస్తున్నామని తెలియచేశారు. ప్రవేశాలు పొందే విద్యార్థులు టీసి, స్టడీ సెర్టిఫికెట్, మీ మీ తల్లిదండ్రుల ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు. కాబట్టి చుట్టుప్రక్కల గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరడమైనది..

## సైడ్ డ్రైన్ ల క్లీనింగ్ మరియు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ప్రజా ప్రతినిధులు..

- **రాబోయే వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు.**

**మణుగూరు.జూన్ 12 (డి డి 9వార్త)**



మణుగూరు మండలం లోని,సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధిలోని 1 & 4 వ వార్డులలో స్థానికంగా ఉన్న డ్రైనేజీలు చెత్తా చెదారం పేరుకుపోయి మురుగునీరు రోడ్ల పైకి వచ్చి ప్రజలకు ఇబ్బందిగా మారడంతో సర్పంచ్ మరియు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య పనులను దగ్గరుండి తమ సిబ్బందితో చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ ఇళ్లలోనే కాకుండా, ఇంటి పరిసర ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు పారిశుద్ధ్యం,పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సమితిసింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, 4 వ వార్డు సభ్యురాలు శ్రీమతి ఊకె కృష్ణవేణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు A M చారి, బొజ్జా త్రిమూర్తులు, ఎమ్ డి యాకుబ్ అలి, ఎండి ముస్తఫా, స్థానిక ప్రజలు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగునీటి విస్తరణే లక్ష్యంగా సాగిన ఉన్నతస్థాయి సమావేశం..

- **సీతారామ, సీతమ్మసాగర్, మున్నేరు, పాలేరు లింక్ కాలువ పనుల పురోగతిపై జలసౌధలో అత్యున్నత సమీక్ష..**
- **పాల్గొన్న సంబంధిత జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు,ఇతర ఉన్నతాధికారులు**
- **సమీక్షలో ప్రత్యేకంగా నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు.జూన్ 12 (డి డి 9వార్త)**

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో కొనసాగుతున్న ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ పనుల పూర్తి, సాగునీటి విస్తరణ లక్ష్యాలపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి నేతృత్వంలో గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి,వాకిటి శ్రీహరి గార్ల తో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పురోగతి, సీతమ్మసాగర్ ప్రాజెక్టు, మున్నేరుపాలేరు లింక్ కాలువ పనులతోపాటు భూసేకరణ, పునరావాసం (ఆర్అండ్ఆర్), అటవీ అనుమతుల అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్టుల వారీగా పనుల ప్రస్తుత స్థితి, నిర్దేశిత లక్ష్యాలు, ఎదురవుతున్న సమస్యల పై అధికారులతో సమీక్ష నిర్వహించారు.
సమీక్షా సమావేశం సందర్భంగా... పినపాక నియోజకవర్గ పరిధిలోని పలు అంశాలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొస్తూ సమస్త రైతాంగానికి జీవనాడిగా నెలకొన్న సీతారామ ప్రాజెక్టు ద్వారా ప్రజలకు, రైతులకు సాగునీరు, త్రాగునీరు అందించే అంశాలను వివరించారు. అలాగే ప్రాజెక్టు నిర్మాణం, స్టోరేజ్ నిల్వల సామర్థ్యం వలన భూగర్భజలాలు పెరగడంతో ప్రస్తుతం ఉన్న పరిశ్రమలతో పాటు మరిన్ని నూతన ఉత్పాదక పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు.అలాగే,బూర్గంపహాడ్ మండల రైతాంగానికి జీవనాడిగా దోహదపడే దోమలవాగు ప్రాజెక్టు నిర్మాణ ప్రక్రియను, అశ్వాపురం మండలం పరిధిలోని మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణ అవసరతను, జరుగుతున్న రైట్ కెనాల్ నిర్మాణ పనులు, జరగాల్సిన లెఫ్ట్ కెనాల్ నిర్మాణ ప్రతిపాదనలను వివరించారు.
అదేవిధంగా... కరకగూడెం మండలంలోని పులుసుబొంత ప్రాజెక్టు నిర్మాణ ప్రక్రియ, తద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ప్రణాళికను మరియు మణుగూరు, పినపాక మండలాల్లోని అన్నారం, భూపతిరావుపేట లిఫ్ట్ ఏర్పాట్లపై చర్చిస్తూ నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాలలో వరదల కారణంగా దెబ్బతిన్న పలు సప్టాలు, వంతెనల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కోరారు. అదేవిధంగా... జాతీయ ప్రాజెక్టు పోలవరం నిర్మాణం వల్ల కలిగే ఆర్థిక, సామాజిక, భౌగోళిక ప్రభావాలను వివరిస్తూ శాస్త్రీయబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై ఉన్నతస్థాయి కమిటీకి విన్నవించారు. ప్రజలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి సమగ్రమైన నివేదికను అందించేలా చొరవ చూపాలని కోరారు. జరుగుతున్న నిర్మాణ పనులు, నూతన ప్రతిపాదనలపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ పనులు వేగవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని కీలక నీటిపారుదల ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సంక్షేమం, సాగునీటి విస్తరణ, నీటి వనరుల సమర్థ వినియోగం లక్ష్యంగా అన్ని ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కట్టుబడి ఉందని తెలిపారు.








## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు

**కన్నాయిగూడెం, జూన్ 12 (డిడి9 వార్త):**

కన్నాయిగూడెం మండలంలోని గూర్రేవుల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలిలతో మాట్లాడి, వారికి కూలీ డబ్బులు సకాలంలో అందుతున్నాయా అని తెలుసుకున్నారు, పని ప్రదేశంలో తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ కూలిలకు చల్లటి మజ్జిగ పంపిణీ చేశారు. కూలిలకు సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మఠం వెంకటేష్, పూజారి కిషోర్, శ్రీరాముల వెంకటేశ్వర్లు, శ్రీరాముల సందీప్ వాసంపెల్లి సురేష్ , లక్ష్మీనారాయణ, తిప్పనపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.





## బ్రెయిన్ స్ట్రోక్ తో బాధపడుతున్న జుంజురు వీరసింహ

- **సాయం కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు..**

**జూన్ 12 డిడి9 వార్త దుమ్ముగూడెం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం భైరాగులపాడు గ్రామస్తుడు అందరికీ సుపరిచితుడైన , జుంజురి వీరసింహ కి గత నాలుగు రోజుల క్రితం అకస్మాత్తుగా తీవ్రమైన బ్రెయిన్ స్ట్రోక్ రావడం జరిగింది. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యుల సూచన మేరకు ప్రాణాపాయ స్థితి నుండి బయటపడేందుకు అత్యవసర శస్త్రచికిత్స (ఆపరేషన్) చేయాల్సి ఉందని, దానికి సుమారు రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారని కుటుంబ సభ్యులు తెలిపారు.
దురదృష్టవశాత్తు,మా కుటుంబ ఆర్థిక పరిస్థితి అంత పెద్ద మొత్తాన్ని భరించే స్థితిలో లేదు అని ఈ క్లిష్ట సమయంలో మీ అందరి సహాయం మాకు కావాలని వేడుకుంటున్నారు మీ యొక్క సహాయం ఎంతో ధైర్యాన్ని, ఆశను ఇస్తుందిఅని అందువల్ల మానవత్వంతో స్పందించి మీకు తోచినంత ఆర్థిక సహాయం అందించి ఒక కుటుంబానికి అండగా నిలవాలని కోరుతున్నామని అన్నారు. మాకు సహాయం చేయవలసిన ఫోన్ నెంబర్లు

**PhonePe / Google Pay నంబర్లు:**
**8184891391**
**7095940299**

## చెట్లకు తిరిగి జీవం పోస్తున్న ఆర్ జి -1 జియం. లలిత్ కుమార్.

- **గోదావరిఖనిలో పర్యావరణ పరిరక్షణకు సింగరేణి ప్రత్యేక చర్యలు.**

**డిడి9వార్త / రామగుండం జూన్ 13:**



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పరిసర ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు సింగరేణి సంస్థ చేపడుతున్న చర్యలు స్థానికుల ప్రశంసలు అందుకుంటున్నాయి. అభివృద్ధి పనుల నేపథ్యంలో దెబ్బతిన్న లేదా కూలిపోయిన చెట్లను,చెట్ల వేర్లు, కొమ్మల నుంచి కొత్త మొక్కలను పెంచే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.ఈ నేపథ్యంలో ఇటీవల గాలులకి కూలిన 80సంవత్సరాల చెట్టును అధికారులు ఆర్ జి 1జిఎం డి లలిత్ కుమార్ దృష్టికి తీసుకొని వెళ్లగా వెంటనే స్పందించిన జి ఏం, చెట్టుకు తిరిగి ప్రాణం పోయాలని దానికి సంబంధించిన పూర్తి బాధ్యత తీసుకొని చెట్టును కాపాడిన విధానం ప్రజల అందరి ప్రశంసలు అందుకొనే విధంగా ఉంది. ఈ కార్యక్రమాన్ని సింగరేణి 11 ఇన్‌క్లైన్ ఏజెంట్ శ్రీనివాస్ పర్యవేక్షించారు. పాత చెట్ల అవశేషాల నుంచి కొత్త చిగుర్లు వెలువడేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, ప్రకృతి సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. అభివృద్ధి పనులతో పాటు పచ్చదనాన్ని కాపాడే లక్ష్యంతో సింగరేణి సంస్థ ముందుకు సాగుతుండగా, "ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందుతుంది" అని అధికారులు పేర్కొన్నారు. ఈ చర్యలు పర్యావరణ పరిరక్షణలో సింగరేణి నిబద్ధతను చాటుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.







## ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి..

- **మణుగూరు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కంబపు సూరిరెడ్డి.**

**మణుగూరు.జూన్ 12(డి డి 9వార్త)**



ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మణుగూరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని మణుగూరు మండలం తోగూడెం గ్రామంలో గల ఇటుక బట్టీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి మాట్లాడుతూ.. 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టడం చట్ట విరుద్ధం, ప్రతి చిన్నారికి విద్య, ఆరోగ్యం మరియు సురక్షితమైన బాల్యం పొందే హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. చిన్నారులను పనుల్లో నిమగ్నం చేయడం చట్టవిరుద్ధమని, వారిని పాఠశాలలకు పంపించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన సూచించారు. అలాగే, బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం, 1986 మరియు విద్యా హక్కు చట్టం, 2009 ప్రకారం బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. బాల కార్మికత్వాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రకాని గురుకృష్ణ, న్యాయవాదులు వీరంకి పద్మావతి, వాసవి, డిఎల్ఎస్ఐ బాధ్యులు రవీందర్, మరియు పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# కన్నెపెల్లి బడికి,,అక్షరకాంతులు..!!

- చదువులమ్మబడికి విజ్ఞాన హారతులు,,,
- 10ఏండ్ల తర్వాత కన్నెపెల్లిలో బడిగంట మోగెను,,,
- అబ్బురపోయి ఆశ్చర్యపడిన ఆదివాసీలు,,,
- జిల్లాలోనె కన్నెపెల్లిలడికి కీర్తి,, ప్రతిష్టలు,,,,
- విద్యార్థులపేరెన్స్,,గ్రామస్తుల కు కలెక్టర్ ప్రశంసలు,,,
- పాయంమానేశ్వర్ రావు H M కృషి,పట్టుదల,శ్రమతో బడికి పిల్లలు,,,
- ఎం ఈ ఓ గడ్డిశ్రీనువాస్ అభి నందనలు తెలిపె,,,
- నేడు,బడిని ప్రారంభించనున్న మంత్రిసీతక్క,,,

**ఏటూరునాగారం క్రైం,డి డి 9 వార్త, జూన్ 12**







అదొౕక కు గ్రామం సాక్షాత్తు సారలమ్మ దేవత కొలువు దీరిన కన్నెపెల్లి గ్రామం,అయినప్పటి జిల్లాలో అధికారులు,,మండల అధికారులు పట్టింపు లేక ఇక్కడి బడిమూతబడింది తా జాగా 10ఏండ్ల తర్వాత మళ్లీ ఓపనింగ్ చేస్తున్నారు, ములు గుజిల్లాలొని తాడ్వాయి మండలం కాల్వపెల్లిలొ అంతా గిరి జనకుటుంబాలెనివశిస్తున్నాయి,కాని ఆదివాసీల పిల్లలు అక్షరజ్ఞానం నేర్పేందుకు బడి లో పనిచేస్తు న్న ఉపాద్యాయు లను బదిలిచేసి జుల్లావిద్యాధి కారి చేతులు తడుపుకుని బడిమూత కు కారణమైనారు పదేండ్లుగక ఇక్కడ పాఠశాల ఉన్నవిషయం కలెక్టర్ గాని ఇంకెవరికి తెలియదు,బడిలే కోవడం ఉపాద్యా యులు రాకపోవడం నడువలేదు ఇక్కడి పిల్లలు చదువుకోవాలంటె అంగన్ వాడి తర్వాత పైచదు వులకు నార్లాపురం,,తాడ్వాయి,పస్రాకు వే ల్లాల్సి వచ్చెది దూరంవెల్లలేక మానేసినట్లు సమాచారం,,

**పెద్దసారు మానేశ్వరరావు కృషి,పట్టుదల,శ్రమతొ,,,!!**

ఆదివాసీల పిల్లలు నిరక్షరా సులు కావద్దని గ్రహించిన పెద్ద సారు మానేశ్వరరావు దృషిటి పెట్టెను, మూతబడిన బడిని తెరిపించుటకు ఎన్నొ ఇబ్బం దులు ఎన్నొ ఆగచాట్లు,పడు తున్నారు,, ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగహన కల్పించారు ఉన్న ఊరిబడిలొ సౌకర్యంగా ఉంటుందని పేరెన్స్ కు తెలిపునచ్చజెప్పి ఒప్పించారు, పిల్లలను జ్ఞాదరింగు చేశారు ,పుల్ ప్లెడ్జుగా అడ్మిషన్ చేసెవిధంగా, గ్రా మస్తులను, పెరెన్స్ ను ఒప్పించారు తనకృషిపట్టు దల శ్రమ పలింబోతున్నాయి, గ్రామస్తు లు కూడా అభినంచారు,ఇంటింటికి తిరిగి పిల్లలను పంప మని పెరెన్స్ నుకోరెను అందు కు ఒప్పుకును అడ్మిషన్ చేశారు, ఈ హెడ్మా స్టర్ చేసిననిర్వి రామ కృషితొ బడి రీ ఓపెన్ అవుతున్నందుకు కలెక్టర్ అభి నందనలు తెలిపారు ఎంతకీషి ఉంటె 10 ఏండ్లుగా మూత బడిన బడినితెరి పించడం మామూలు విషయం కాదని సర్వత్ర అభినందనలు తెలుపడుతున్నారు, ఎంఈ ఓ కూడ మాహేశ్వరి రావును అభి నందనలు తెలిపారు,,

**నేడు కన్నెపెల్లిబడి ప్రారంభిం చనున్న సీతక్క,,,!!**

కన్నెపెల్లిలొ బడిని మళ్లీ రీ ఓపన్ చేస్తున్నా రు, మంత్రిసీతక్క చేతుల మీదుగ ఈబడి రీ ఓపెన్ కాబోతున్నదని కన్నె పెల్లి బడిలొ చదువులమ్మ పండుగను నిర్వహిస్తున్నారు మొదటగా చిన్నబోయినపెల్లి బడి రాష్టంలోనె ప్ర భంజనం అయింది కన్నెపెల్లి బడి మరొౕక రెండొ ప్రబంజనం అవుతున్నదని అంటున్నారు,,నేడు కన్నెపెల్లికి మంత్రిసీతక్క రానున్నారు, బడిని రీ ఓన్ చేసిగ్రామస్తులతొ సమావేశమై మాట్లాడుతారు



## ఉప్పేరులో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

- 110 మందికి ఉచితంగా షుగర్ పరీక్షలు, ఉచితంగా మందుల పంపిణీ.
- ఏజెన్సీలో సింధు హాస్పిటల్ వైద్య సేవలు అభినందనీయం - పంచాయతీ కార్యదర్శి యు. గంగాధర్

**కుక్కునూరు, జూన్ 12 డిడి9 వార్త**

ఏజెన్సీ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా భద్రాచ లానికి చెందిన సింధు హాస్పిటల్ ఆధ్వర్యంలో కుక్కునూరు మండలం ఉప్పేరు గ్రామ సచివా లయంలో ఏర్పాటు చేసిన 'ఉచిత మెగా వైద్య శిబిరం' విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి యు. గంగాధర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాలలోని పేద ప్రజల కోసం ఉచితంగా వైద్య సేవలు అందిస్తూ, మందులను పంపిణీ చేయడం అభినందనీయమని, ఇటువంటి సేవా కార్యక్రమా లు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఏజెన్సీలో పేద ప్రజల కోసం ఇటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమ ని అన్నారు.

**ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ పోతరాజు ప్రశాంత్**

శిబిరంలో పాల్గొన్న సింధు హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పోతరాజు ప్రశాంత్ మాట్లాడుతూ.. "తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించా లనే సంకల్పంతో భద్రాచలంలో సింధు హాస్పి టల్‌ను ప్రారంభించాం. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ముఖ్యంగా షుగర్, బీపీ ఉన్న వారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలు పాటించాలి" అని సూచించారు. రానున్న వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని, ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. ఈ శిబిరంలో సుమారు 110 మందికి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసర మైన మందులను ఉచితంగా పంపిణీ చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యేసు బాబు, రమేష్, జనసేన నాయకులు కోటి, సందీప్, నవీన్, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కొప్పుల మురళి,హాస్పిటల్ సిబ్బంది నాగేంద్ర, కీర్తన, శృతి, హరికృష్ణ తది తరులు పాల్గొన్నారు.







## అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్న ఫారెస్ట్ అధికారులు.

- అత్యుత్సాహం ప్రదర్శిస్తూ సామాన్య ప్రజలపై జులుం..
- ఊరు మధ్యలో ఫారెస్ట్ భూమి అంటూ అభివృద్ధికి అడ్డంకులు..
- ఆధారాలతో సహా ఉన్నత అధికారులకు పిర్యాదు చేస్తాం.
- బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్..

**మణుగూరు.జూన్ 12(డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం మండలంలో పలు కంపార్ట్ మెంట్ లలో విధులు నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులు అధికార పార్టీ కి వత్తాసు పలుకుతూ సామాన్య ప్రజలపై అత్యుత్సాహం కనపరుస్తూ జులుం ప్రదర్శిస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఫారెస్ట్ అధికారు లపై మండి పడ్డారు.శుక్రవారం నాడు పాత్రికే యులతో మాట్లాడుతూ.. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని వుందన్నట్లు ప్రతీ అభివృద్ధి కార్యక్రమాలకు ఆ అధికారులు అడ్డు పడి అభి వృద్ధి ని అడ్డుకుంటున్నారన్నారు.

ఊరు మధ్యలో ఫారెస్టు భూమి అంటూ కొత్త భాష్యాలకు,వివాదాలకు తెర లేపుతున్నార ని,ఊరు మధ్యలో ఫారెస్ట్ భూమి అంటూ హడావుడి చేయటంలో ఆంతర్యమేమిటో అర్థం కావట్లేదన్నారు.వీరు అటవీ భూమి అన్న ప్రాంతం చుట్టూ సీసీ రోడ్లు,బహుళ అంతస్తుల భవనాలు,మిషన్ భగీరథ పైప్ లైన్ లు,ఇంటింటికి నల్లా కనెక్షన్లు,ఇందిరమ్మ ఇళ్లు ఇవన్నీ కళ్ళ ముందు కనిపిస్తున్నా కొన్ని నిర్దేశిత ప్రాంతాలను మాత్రమే ఎంచుకొని ఇది ఫారెస్టు భూమి,ఇక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టొద్దు అని హుకుం జారీ చేస్తూ ప్రజలను కొంతమంది అధికారులు భయభ్రాంతుల కు చేస్తున్నారని,అధికార పార్టీ నాయకుల ప్రోద్బలం తో మామూళ్ల మత్తులో జోగుతూ పలు కంపార్ట్మెంట్ లో ఉన్న వందల ఎకరాల భూమిని అన్యాక్రాంతం చేస్తూ బడా బాబులకు అప్పచెప్తూ,ఉన్నత అధికారుల మెప్పు కోసం అటవీ భూమిని మేము కాపాడాము అని చెప్పుకోవటం కోసం సామాన్య ప్రజలపై విరు చుకుపడటం దారుణమ న్నారు.ఇట్టి విషయా లపై సంబంధిత శాఖల ఉన్నత అధికారులకు సిసియఫ్ కు పిర్యాదు చేయబోనున్నామని ,అధికారులు పద్ధతి మార్చుకోవాలని హెచ్చ రించారు.

## మణుగూరు ఐటిఐ ప్రిన్సిపాల్ గా బాధ్యతలు చేపట్టిన సారంగపాణి..

**మణుగూరు.జూన్ 12 (డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు ప్ర భుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ గా ఓ సారంగపాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో భూపాలపల్లి ఐటిఐ లో ట్రైనింగ్ ఆఫీసర్ గా పనిచేసిన ఆయన పదోన్నతి పై మణుగూరు కు రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఐటిఐ లో విద్యార్థు లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూ స్తానన్నారు. విద్యార్థుల్లో శిక్షణ నైపుణ్యాలను పెంపొందించడానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా ఐటిఐ ప్రవేశాల కోసం ఈనెల 30 వరకు గడువు ఉన్నందున స్థానిక యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకో వాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాలలో సైతం ఆధునిక సాంకేతికరణ పెంపొందించడం కోసం ప్రభుత్వం ఐటిఐలలో ఏటీసీ కోర్సులను ఏర్పాటు చేసి అడ్వాన్స్డ్ టెక్నాలజీ కోర్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటివ రకు ఇక్కడ ఇంచార్జ్ బాధ్యతలు నిర్వహించిన సాగర్ ప్రిన్సిపాల్ డి వెంకటేశ్వరరావు వారిని అభినందించి బాధ్యతలు అప్పగించారు. అదే విధంగా కా ఐటిఐ ఎటిసి ఉద్యోగులు సిబ్బంది నూతన ప్రిన్సిపాల్ ను సాధారంగా ఆహ్వానించి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐటిఐ సూపరిండెంట్ జ్యో తిరాణి, సీనియర్ అసిస్టెంట్ సాధన, ఏటీవోలు vజీవి కృష్ణారావు, ఎం శ్రీనివాసరావు, ఏ నర్స య్య, వేణుగోపాల్ నాయుడు, కే ధర్మయ్య, ఏటీసీ మాస్టర్ ట్రైనర్ పూర్ణచంద్రరావు ఇతర సిబ్బంది ఉద్యోగులు పాల్గొన్నారు.

## మెంబర్షిప్ డ్రైవ్ కొరకు ముఖ్య కార్యకర్తల సమావేశము..

**మణుగూరు.జూన్ 12 (డి డి 9వార్త)**



ఈనెల 15 వ తేదీన (సోమవారం) ఉదయం 9.00 గంటలకు మణుగూరు పట్టణం లోని హనుమాన్ ఫంక్షన్ హాల్ నందు మెంబర్షిప్ డ్రైవ్ కొరకు పినపాక నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది అని బిఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పార్టీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్చార్జ్, MLC తక్కెళ్ళపల్లి రవీందర్ రావు గారు, పార్టీ సభ్యత్వ నమోదు పినపాక ని యోజకవర్గ ఇంచార్జ్ దిండిగాల రాజేందర్ గారు పాల్గొంటారు.కావున ఈ కార్యక్రమం లో అన్ని మండలాల అధ్యక్షులు, టౌన్ పార్టీ అధ్యక్షులు,TBGKS నాయకులు, మాజీ ఎంపీపీ, మాజీ జడ్పిటిసిలు, సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీలు, PACS అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచు లు, విద్యార్థి, యువజన నాయకులు, మాజీ వార్డు సభ్యులు, మహిళా నాయకులు, ఉద్యమకారులు, SC, ST, BC, మైనారిటీ ముఖ్య నాయకులు, సోషల్ మీడియా నాయ కులు,కార్మిక సంఘాల నాయకులు, కార్యక ర్తలు, అభిమానులు పాల్గొని ఈ సమావేశా న్ని విజయవంతం చేయవలసిందిగా రేగా కాంతారావు విజ్ఞప్తి చేశారు.

## కొండపర్తిలొ డీసిబి బ్యాంకు అర్థికతనపైఅవగాహన,, ,!!

- గిరిజనులకు బ్యాంకుసేవల పట్ల అవగాహన,,,
- రుణం పొందుట,పొదుపు చేయడం పట్ల అవగాహన,,,
- పంటలకుభీమా,రుణాలను తిరిగి సకాలంలొ చెల్లించాలె,,
- బ్యాంకుఖాతా దారులంతా తెల్సుకోవాలె,,,,

**ఏటూరునాగకరం క్రైం, డి డి 9 వార్త జూన్ 12**

మండలంలోని కొండపర్తులొ డిసిసి సా కారసొసైటి బ్యాంకు ఏటూరునాగారం శాఖ మేజర్ తాడ్వాయి సాకారసంఘం ఆ ద్వర్యంలొ ఈసదస్సును నిర్వ హించింది, ఖాతాదారులు బ్యాంకు సేవలను ఏవిధంగ వినియెగించు కోవాలెనొ వివిరించారు బ్యాంకు అధికారులలు ఈసందర్బంగ మాట్లాడుతు డబ్బును పొదుపు చేస్తె మనకు అవసరమైనప్పుడు ఏవిధంగా ఉపయెగం అవుతుందొ తెలిపారు రుణాలను పొందడం, సకాలంలొ తురిగి ఇవ్వడం మూలంగావడ్డితగ్గును ఆలస్యం చేస్తె అధకబారం ఆవును ఇబ్బందులు అవుతయి అదెవిధంగా పంటలకు భీమా కె వి సి చేయంచడం మూలంగా ఏదైననష్టం జరిగితె బ్యాంకుద్వార ప్రభుత్వం ఆ భీమా ఇన్సూరెన్స్ ను రైతులకు చెల్లించును దీంతొ రైతులకు పంటనష్టం లేకుండ ఉంటుంది, మండలం పరిదిలొని ప్రతిగ్రామంలొని రైతులు ఈవిషయాన్ని తెల్సుకుని బ్యాంకును అభివృద్దివైపున నడిపించుటకు సాకరీం చాల ని కోరడమైనది,ఈకార్యక్రమం లొ ఏటురునాగారం సాకార బ్యాంకు మేనేజ ర్,పీల్డాఫిసర్ స్టాప్,సిబ్బంది తాడ్వాయిసొ సైటి సి వొ ఉదయ్,సిబ్బంది ప్రవీణ్ కుమార్ ఆదినారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొ న్నారు.






## మతోన్మాదానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలి

- ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య

**గోవిందరావుపేట, జూన్ 12 (డిడి9 వార్త)**



ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం రాష్ట్ర అధ్యక్షులు రజినీకాంత్ అధ్యక్షతన మండల కేంద్రంలోని పి.ఎస్. ఆర్ గార్డె న్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచా ర్య హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మతోన్మాద శక్తులు విద్యా వ్యవస్థను, రాజ్యాంగ విలువ లను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. అలాంటి విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా విద్యార్థి సమాజం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లనే తరచూ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలు జరుగుతున్నా యని విమర్శించారు. యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే ఇటువంటి పరిణామా లను అరికట్టేందుకు పారదర్శకమైన పరీక్షా విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్య దర్శి నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభు త్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకుండా వాటిని మూసివేసే విధానాల ను అనుసరిస్తోందని విమర్శించారు. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో లేకుండా చేసి, విద్యను కేవలం ధనికులకు మాత్రమే పరిమితం చేసే పరిస్థితిని సృష్టిస్తోందని అన్నారు. విద్య హక్కును కాపాడేందుకు విద్యార్థులు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి హతిక్ హమ్మద్, జాతీయ కమిటీ సభ్యులు శంకర్, మమత, రాష్ట్ర ఉపాధ్య క్షులు దామెర కిరణ్, అశోక్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు రంజిత్ రెడ్డి, దీపికా, శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు భరత్ రాజు, స్మరన్, రవి, రవితేజ, రమేష్, రమ్య, పవన్, కృపా, విఘ్నేష్, అభి, స్టాలిన్, లెనిన్ గువేరా, మధు, జ్యోతి బసు, అరవింద్ తదితరులు పా ల్గొన్నారు.

# మూగజీవాల ప్రాణాలు తీసిన తెగిన విద్యుత్ తీగలు..

- రెండు లక్షల విలువచేసే నాలుగుపాడి గేదలు మృతి..

**జూన్12 డిడి 9 వార్త వెంకటాపురం.**



వెంకటాపురం మండలం పాత్రపురం గ్రామపంచాయతీ పరిధిలోని పాత్రపురం గ్రామ సమీపంలో శుక్రవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామ శివారులో విద్యుత్ తీగల పక్కనే ఉన్న వెదురు బొంగులకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు స్థానికులు తెలిపారు. దీంతో మంటల వేడికి విద్యుత్ తీగలు కరిగిపోయి తెగిపడి నేలపై పడిపోయాయి. ఈ విషయం తెలియని రైతుల పాడి గేదెలు మేతకు వెళ్తున్న సమయంలో నేలపై పడివున్న విద్యుత్ తీగలు తగిలి నాలుగు పాడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి.

మృతి చెందిన గేదెల యజమానులు వెంగళరావుపేట గ్రామానికి చెందిన సాధనపల్లి బతుకమ్మ, సాధనపల్లి చిట్టిబాబు, టేకులబోరు గ్రామానికి చెందిన పోరిచెట్టి చంటి, పాత్రపురం గ్రామానికి చెందిన కారం చిన్ని అని గుర్తించారు. ఘటనపై స్థానికులు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. మృతి చెందిన ఒక్కో గేదె విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని, మొత్తం రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవనాధారమైన పాడి గేదెలను కోల్పోయామని, ప్రభుత్వం, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తగిన నష్టపరిహారం అందించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు. అలాగేబి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# "ప్రీ ప్రైమరి స్కూల్‌స్‌ను ICDSకే అప్పగించాలి – సీఐటీయూ డిమాండ్"

**వాజేడు జూన్ 12 (డిడి9 వార్త):**

ప్రీప్రైమరి స్కూల్ నిర్వహణను తిరిగి ICDS శాఖకే అప్పగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కొప్పుల రఘుపతిరావు మాట్లాడుతూ, ICDS ఆధీనంలో నడిచే 3 నుంచి 5 సంవత్సరాల చిన్నారులను "ప్రీప్రైమరి స్కూల్" పేరుతో ICDS నుంచి వేరు చేసి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం అంటే ICDS వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని విమర్శించారు.ICDSను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం నిధులు తగ్గించడం, సరుకుల నాణ్యత మెరుగుపరచకపోవడం, భవనాల నిర్మాణాలు పూర్తి చేయకపోవడం, అద్దె భవనాల్లో కేంద్రాలను నిర్వహించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రీప్రైమరి విధానాన్ని బలవంతంగా అమలు చేస్తే తీవ్రంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎట్టి సరిత, ఆలం పద్మ, దబ్బాకట్ల శకుంతల, ఐద్వా జిల్లా కార్యదర్శి కుర్సం నాగలక్ష్మి, నాయకులు పుల్లూరి యశోద, యాలం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# పలకరించిన తొలకరి జల్లులు..

**గోవిందరావుపేట, జూన్ 12(డి డి 9 వార్త)**

మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో శుక్రవారం సాయంత్రం కురిసిన తొలకరి జల్లులు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాయి. గత కొన్ని రోజులుగా భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనాన్ని కలిగించింది.

సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీచడంతో పాటు స్వల్ప వర్షం కురిసింది. వర్షపు చినుకులు నేలను తాకగానే మట్టి పరిమళాలు వెదజల్లగా, గ్రామమంతా ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. చెట్లు, మొక్కలు వర్షపు జల్లులతో స్నానం చేసినట్లుగా మెరిసిపోగా ప్రకృతి కొత్త శోభను సంతరించుకుంది.

తొలకరి వర్షంతో రైతుల్లోనూ ఆనందం వ్యక్తమైంది. రానున్న ఖరీఫ్ సాగుకు ఈ వర్షాలు శుభసూచకమని రైతులు పేర్కొన్నారు. గ్రామలలోని చిన్నారులు వర్షంలో తడుస్తూ సందడి చేయగా, పెద్దలు సైతం ఎండల నుంచి ఉపశమనం లభించిందంటూ సంతోషం వ్యక్తం చేశారు.

వేసవి వేడిమికి వీడ్కోలు పలుకుతూ కురిసిన ఈ తొలకరి జల్లులు ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. గ్రామమంతా చల్లని వాతావరణంతో సేదతీరగా, మరిన్ని వర్షాలు కురవాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# పని పూర్తి చేసి "మూడేళ్లు"బిల్లుల కోసం ఇంకా ఎదురు చూపులే...

- పని పూర్తి చేసి "మూడేళ్లు"బిల్లుల కోసం ఇంకా ఎదురు చూపులే...
- బిల్లులు రాక అప్పల ఊబిలో కాంట్రాక్టర్ కుటుంబం..
- గుడ్ సర్టిఫికెట్ ఇచ్చారు కానీ బిల్లు మాత్రం ఇవ్వలేదు..

**జూన్12 డిడి9 వార్త దుమ్ముగూడెం.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని నరసాపురం గ్రామంలో గల సూదిరెడ్డి నాగిరెడ్డి - ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ స్కూల్‌లో 202324 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే విడుదల చేయాలని కాంట్రాక్టర్ సత్య శేఖర్ రెడ్డి ప్రభుత్వ అధికారులను కోరారు.

స్కూల్ అభివృద్ధి కోసం సుమారు రూ.32 లక్షల విలువైన పనులను నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. పాఠశాల గదుల్లో నాపరాళ్లు వేయడం, వంట షెడ్ నిర్మాణం, విద్యుత్ బల్బులు, వైరింగ్ ఏర్పాటు, పాఠశాల ఆవరణలో రాళ్లు వేయడం తదితర పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి సంబంధిత పాఠశాల యాజమాన్యానికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

పనుల నాణ్యత, సమయపాలనను గుర్తించిన స్కూల్ యాజమాన్యం తనకు గుడ్ సర్టిఫికెట్ కూడా జారీ చేసిందని ఆయన వివరించారు. పనులు పూర్తయిన అనంతరం బిల్లుల చెల్లింపుల కోసం అవసరమైన అన్ని పత్రాలను అప్పటి జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌కు సమర్పించినట్లు తెలిపారు.

అయితే మొత్తం బిల్లులో ఇప్పటివరకు కేవలం రూ.10 లక్షలు మాత్రమే విడుదలయ్యాయని, మిగిలిన బకాయిలు చెల్లించకుండా సంవత్సరాలు గడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లుల కోసం అనేకసార్లు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాలేదన్నారు.

పనులు పూర్తి చేయడానికి బ్యాంకులు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేసి ఖర్చు పెట్టాల్సి వచ్చిందని, ప్రస్తుతం ఆ అప్పులపై పెరుగుతున్న వడ్డీలు చెల్లించలేక తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. బిల్లుల చెల్లింపులో జరుగుతున్న జాప్యం తన కుటుంబ జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు.

ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని, చిన్న కాంట్రాక్టర్ల సమస్యలను అర్థం చేసుకుని న్యాయం చేయాలని ఆయన కోరారు. తాను చేసిన పనులకు సంబంధించిన పూర్తి రికార్డులు, ధ్రువీకరణ పత్రాలు, గుడ్ సర్టిఫికెట్ అందుబాటులో ఉన్నాయని, అవసరమైతే వాటిని అధికారులకు సమర్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి పెండింగ్ బిల్లులను మంజూరు చేసి తన కుటుంబాన్ని ఆర్థికబి ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని కాంట్రాక్టర్ సత్య శేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.









# డా యం.వి.కోటిరెడ్డి గారి సేవలు ప్రశంసనీయం

- భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

**భద్రాచలం, జూన్ 12 , డిడి9 వార్త**

ఏజెన్సీ ప్రాంతంలో 30 ఏళ్లపాటు పేద ప్రజలకు వైద్య సేవలందించి ప్రభుత్వ వైద్యుడిగా పదవీ విరమణ చేసిన డాక్టర్ ఎంవి కోటిరెడ్డి సేవలు ఎంతో ప్రశంసనీయమని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలంలోని మారుతి నర్సింగ్ కళాశాలలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన డాక్టర్ కోటిరెడ్డి సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని కోటిరెడ్డి సేవలను ప్రశంసించారు. పినపాక, జానంపేట, చింతూరు, భద్రాచల ప్రాంతాల్లో వైద్యసేలందిస్తూ ఆయా ప్రాంతాల్లోని పేద ప్రజల ఆధారాభిమానాలు చూరగొన్నారన్నారు. అలాగే భద్రాచలం ఏరియా ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేశారని, చింతూరు ఏరియా ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా చేసిన ఘనత డాయం. వి. కోటిరెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యశాఖ ఆరోగ్యశాఖ అధికారి డా డి. సైదులు, భద్రాచలం ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డావై. రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ బి. సుబ్బరాజు, మారుతి నర్సింగ్ కళాశాల చైర్మన్, డాఎ. మోహన్‌రావు, జి.వి.వి. సుదర్శన్, డాజయభారతి, డాపి.రాజశేఖర్ పాల్గొన్నారు.

# భద్రాచలం ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి

- ఆర్ఎంవోలుగా డాక్టర్ సంతోష్, డాక్టర్ మల్లేష్‌ల నియామకం

**భద్రాచలం , జూన్ 12, డిడి9 వార్త**



భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారంనాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల వరకు ఆర్ఎంవోగా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి వైద్యశాల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ ముదిగొండ రామకృష్ణ బదిలీపై మణుగూరు వెళ్లడంతో ప్రస్తుతం ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం నుంచి పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌గా కొనసాగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వృత్తి పట్ల ఎంతో నిబద్ధతో పని చేసే డాక్టర్ రాజశేఖర్‌రెడ్డికిని సూపరింటెండెంట్‌గా నియమించడం పట్ల ఏరియా వైద్యశాల వైద్యులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల వైద్య నిపుణుడిగా బాధ్యతలు నిర్వహించే డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి కీలకమైన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించడం వలన వైద్యశాలలో ఎస్ఎన్‌సీయుతో పాటు ఇతర వైద్య విభాగాలను మరింతగా అభివృద్ధి చేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. అదేవిధంగా వైద్యశాల ఆర్ఎంవోలుగా డాక్టర్ సతోంసంతోష్ డాక్టర్ మల్లేష్‌లను నియమించారు.

# ఘనంగ ఎండీ అప్సర్ పాషా జన్మదిన వేడుక

**కన్నాయిగూడెం జూన్ 12 (డిడి9 వార్త)**

శుక్రవారం ఈరోజున కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు ఎండీ, అప్సర్ పాషా 45వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన మండల కాంగ్రేస్ నాయకులు మండల కేంద్రంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు నిత్యం ప్రజా సమస్యలు తెలుసుకుంటూ కాంగ్రేస్ పార్టీ బలోపేతానికి మరింతా కృషి చేసి ముందు ముందు గొప్ప గొప్ప పదవుల్లో ఉండాలని ఆశీర్వాదించారు మండల కాంగ్రేస్ పార్టీ ఇంచార్జి బుట్టాయిగూడెం సర్పంచ్ జాడి రాంబాబు,మండల కాంగ్రేస్ నాయకుల తో కలిసి జన్మదిన సందర్భంగా అప్సర్ పాషా కీ శాలువాతో సన్మానించారు జన్మదిన వేడుకలో కన్నాయిగూడెం మండల కాంగ్రేస్ నాయకులు, జిల్లా కాంగ్రెస్ కాంగ్రేస్ నాయకులు, యూత్ కాంగ్రేస్ నాయకులు, వివిధ హోదాల అనుబంధ సంఘాల నాయకులు, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, గ్రామ కమిటీ కాంగ్రేస్ అధ్యక్షులు, కాంగ్రేస్ పార్టీ అభిమానులు, సోషల్ మీడియా వారియర్స్ తదితరులు పాల్గొన్నారు



# కొండపర్తిలో డీసిబి బ్యాంకు అర్థికతనపై అవగాహన...!!

- గిరిజనులకు బ్యాంకుసేవల పట్ల అవగాహన
- రుణం పొందుట,పొదుపు చేయడం పట్ల అవగాహన
- పంటలకు భీమా,రుణాలను తిరిగి సకాలంలో చెల్లించాలె
- బ్యాంకుఖాతా దారులంతా తెల్సుకోవాలె


**ఏటూరునాగారం క్రైం, డి డి.డి 9 వార్త జూన్ 12**

ములుగు జిల్లా తడ్వాయి మండలంలోని కొండపర్తులో డిసిసి సాకారసొసైటి బ్యాంకు ఏటూరునాగారం శాఖ మేజర్ తాడ్వాయి సాకారసంఘం ఆద్వర్యంలో ఈసదస్సును నిర్వహించింది.ఖాతాదారులు బ్యాంకు సేవలను ఏవిధంగ వినియెగించుకోవాలో వివిరించారు. బ్యాంకు అధికారులలు ఈ సందర్బంగ మాట్లాడుతు డబ్బును పొదుపు చేస్తెమనకు అవసరమైనప్పుడు ఏవిధంగా ఉపయెగం అవుతుందొ తెలిపారు.రుణాలను పొందడం,సకాలంలొ తురిగిఇవ్వడం మూలంగా వడ్డితగ్గునని ఆలస్యం చేస్తె అధకబారం అవుతుందని ఇబ్బందులు అవుతయి అదెవిధంగా పంటలకు భీమా కెవైసి చేయంచడం మూలంగా ఏదైననష్టం జరిగితె బ్యాంకుద్వార ప్రభుత్వం ఆ భీమా ఇన్సూరెన్స్ ను రైతులకు చెల్లించును దీంతొ రైతులకు పంటనష్టం లేకుండ ఉంటుంది.మండలం పరిదిలొని ప్రతి గ్రామంలొని రైతులు ఈవిషయాన్ని తెల్సుకుని బ్యాంకును అభివృద్ధివైపున నడిపించుటకు సాకరీంచాలని కోరారు.ఈ కార్యక్రమం లొ ఏటురునాగారం సాకారబ్యాంకు మేనేజర్, పీల్డాఫిసర్,స్టాప్,సిబ్బంది తాడ్వాయిసొసైటి సివొ ఉదయ్,సిబ్బంది ప్రవీణ్ కుమార్ ఆదినారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కన్నాయిగూడెం జూన్12 (డిడి9 వార్త)**



విద్యుత్ వినియోగదారులకు తెలియజేయునది ద్వితీయ శనివారం కన్నాయిగూడెం 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలలో నిర్వహణ మరియు మరమ్మత్తు పనులు చేపట్టబడనున్నాయి.ఈ పనుల కారణంగా ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు సంబంధిత ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడును.అందువల్ల సంబంధిత ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అంతరాయాన్ని ముందుగానే గమనించి తమ అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవలసిందిగా మరియు శాఖకు సహకరించవలసిందిగా కోరడమైనది.పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడును.సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ (ఆపరేషన్) ఏటూరునాగారం విభాగం టి.జి.ఎన్.పి.డి.సి.ఎల్.




## సర్పంచ్ పై దాడికి నిరసనగా భారీ ర్యాలీ..

- **దోషులను వెంటనే అరెస్ట్ చేయాలి.. సిపిఎం డిమాండ్..**

**జూన్12 డిడి9 వార్త వెంకటాపురం.**

వెంకటాపురం మండలం మొర్రవానిగూడెం గ్రామపంచాయతీ మహిళా సర్పంచ్ శ్రీమతి శ్యామల వినీతపై గురువారం జరిగిన దాడి ఘటనను నిరసిస్తూ శుక్రవారం గ్రామస్తులు, సీపీఎం నాయకులు మండల కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. శివాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఎన్టీఆర్ సెంటర్, బస్టాండ్, అంబేద్కర్ సెంటర్ మీదుగా పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది.
సర్పంచ్‌పై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. అనంతరం నిర్వహించిన సభలో సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు మాట్లాడుతూ, ఈ ఘటనపై పోలీసు మరియు రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన సర్పంచ్‌కు గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలులో సహకరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో జరిగిన వివాదాలను సాకుగా చూపుతూ కొందరు వ్యక్తులు గ్రామపంచాయతీ అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సర్పంచ్ శ్యామల వినీత మాట్లాడుతూ, గ్రామపంచాయతీ పరిధిలో మహిళా సమాఖ్య భవనం, రెండు అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసి నిధులు కేటాయించిందన్నారు. ఈ నిర్మాణాలకు అవసరమైన స్థలాలను గుర్తించి పంచాయతీకి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ విషయమై త్వరలో జిల్లా కలెక్టర్‌ను గ్రామస్తులతో కలిసి కలుస్తామని తెలిపారు. అభివృద్ధికి ఆటంకం కల్పించే వ్యక్తులు తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు కుమ్మరి శీను, గ్రామస్తులు తోట నాగేశ్వరరావు, వాదం బుచ్చయ్య, వాదం శీను, బొల్లె వెంకట్రావు, కోటేష్, దేవుడు, మోహన్‌రావు, చంటి, ఎం. ధనలక్ష్మి, అరుణ కుమారి, జానకమ్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కెరీర్‌కు దిగ్గజ క్రికెటర్ కేన్ విలియమ్సన్ గుడ్‌బై

- **378 మ్యాచ్‌ల్లో 19,346 పరుగులతో రికార్డు**
- **2021లో కివీస్‌కు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ అందించిన కెప్టెన్**
- **48 వన్డే సెంచరీలు, 33 టెస్టు శతకాలతో అద్భుత కెరీర్**
- **'ఫ్యాబ్ ఫోర్'లో ఒకరిగా చిరస్థాయిగా విలియమ్సన్**

**డిడి9 వార్త:**

న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా గుర్తింపు పొందిన 35 ఏళ్ల కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. దాదాపు 16 ఏళ్ల పాటు సాగిన తన అద్భుతమైన ప్రయాణానికి ముగింపు పలుకుతూ రిటైర్మెంట్ ప్రకటించాడు. సొగసైన బ్యాటింగ్, అద్భుతమైన నాయకత్వం, అసాధారణ స్థిరత్వంతో ప్రపంచ క్రికెట్‌లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన విలియమ్సన్ న్యూజిలాండ్ తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కెరీర్‌ను ముగించాడు.
2010లో భారత జట్టుపై దంబుల్లాలో జరిగిన వన్డే మ్యాచ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన విలియమ్సన్ మొత్తం 378 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 19,346 పరుగులు చేసి న్యూజిలాండ్ తరఫున అత్యధిక అంతర్జాతీయ పరుగుల రికార్డును తన పేరిట నమోదు చేసుకున్నాడు. ఇందులో 48 సెంచరీలు, 6 డబుల్ సెంచరీలు ఉన్నాయి. టెస్టు క్రికెట్‌లో 9,515 పరుగులు చేశారు. 33 సెంచరీలు నమోదు చేసి దేశ చరిత్రలో ఉత్తమ బ్యాటర్‌గా నిలిచాడు.
రిటైర్మెంట్ సందర్భంగా విలియమ్సన్ భావోద్వేగంగా స్పందించాడు. "కొంతకాలంగా ఈ నిర్ణయం గురించి ఆలోచిస్తున్నాను. గత కొన్ని రోజులుగా ఇదే సరైన సమయం అని నాకు స్పష్టమైంది. న్యూజిలాండ్ కోసం ఆడటం నా జీవితంలో అత్యంత గర్వకారణం. ప్రతి మ్యాచ్‌లో నా శక్తి మేరకు 100 శాతం ఇచ్చాను" అని తెలిపాడు.
కెప్టెన్‌గా కూడా విలియమ్సన్ న్యూజిలాండ్‌కు స్వర్ణయుగాన్ని అందించాడు. అతని నాయకత్వంలో కివీస్ జట్టు 2021లో తొలి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. అలాగే రెండు ఐసీసీ ఫైనల్స్‌తో పాటు పలు ప్రపంచ టోర్నీల సెమీఫైనల్స్‌కు చేరుకుంది. 2015లో ఐసీసీ 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్', 2019లో ఐసీసీ టెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు అందుకున్నాడు. సర్ రిచర్డ్ హ్యాడ్లీ మెడల్‌ను రికార్డు స్థాయిలో నాలుగు సార్లు గెలుచుకున్నాడు.
ఇటీవల కాలంలో కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించాలని, ప్రపంచవ్యాప్తంగా జరిగే ఫ్రాంచైజీ లీగ్‌లపై దృష్టి పెట్టాలని విలియమ్సన్ నిర్ణయించుకున్నట్టు అర్థమవుతోంది. 2026లో ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌కు అసిస్టెంట్ కోచ్‌గా చేరడం కూడా అతని అంతర్జాతీయ కెరీర్ ముగింపునకు సంకేతంగా కనిపించింది. 'ఫ్యాబ్ ఫోర్'గా పేరుగాంచిన ఆధునిక క్రికెట్ దిగ్గజాల్లో ఒకడైన కేన్ విలియమ్సన్ తన నైపుణ్యం, అందమైన బ్యాటింగ్ శైలి, ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడే స్వభావంతో క్రికెట్ అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాడు. ప్రపంచ క్రికెట్ లో కేన్ విలియమ్సన్, విరాట్ కోహ్లీ, జో రూట్, స్టీవ్ స్మిత్ 'ఫ్యాబ్ ఫోర్'గా పేరుపొందారు.




## వైభవ్‌ను కట్టడి చేయాలంటే భయపెట్టాలి.. ఈ కుర్రాడు వాళ్లిద్దరి కంటే పెద్ద స్టార్ అవుతాడు: డేల్ స్టెయిన్

- **సచిన్, కోహ్లీలను మించిపోయే సత్తా వైభవ్ సూర్యవంశీకి ఉందని స్టెయిన్ జోస్యం**
- **అయితే ఆ యువ కెరటాన్ని చాలా జాగ్రత్తగా చూసుకోవాలని సూచన**
- **షార్ట్ బాల్స్‌తో వైభవ్‌లో భయం సృష్టిస్తే కట్టడి చేయవచ్చన్న డేల్ స్టెయిన్**
- **కోహ్లీ మానసిక దృఢత్వాన్ని, నిలకడను ప్రత్యేకంగా కొనియాడిన మాజీ పేసర్**

**డిడి9 వార్త:**

భారత క్రికెట్‌లో సరికొత్త సంచలనంగా మారిన 15 ఏళ్ల యువ కెరటం వైభవ్ సూర్యవంశీపై దక్షిణాఫ్రికా పేస్ దిగ్గజం డేల్ స్టెయిన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ తన కెరీర్ ముగించేనాటికి దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీలను మించిపోయే స్థాయికి ఎదుగుతాడని జోస్యం చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 776 పరుగులతో ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న వైభవ్, ఆ వెంటనే ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు భారత టీ20 జట్టులో చోటు దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో SA20 ఐదో సీజన్ సందర్భంగా మీడియాతో మాట్లాడిన స్టెయిన్, వైభవ్ ప్రతిభను ఆకాశానికెత్తాడు.
"వైభవ్ ఒక స్పెషల్ టాలెంట్. ప్రస్తుతం చాలా మంది అంతర్జాతీయ ఆటగాళ్ల కంటే మెరుగ్గా ఆడుతున్నాడు. అతను భారత క్రికెట్‌కు దొరికిన ఒక అద్భుతం, ఒక నిధి లాంటివాడు" అని స్టెయిన్ పేర్కొన్నాడు.
అయితే, ఇంతటి ప్రతిభావంతుడిని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని హెచ్చరించాడు.
"సచిన్, కోహ్లీ లాంటి దిగ్గజాల గురించి మనం ఆలోచిస్తాం. కానీ, ఈ కుర్రాడు వాళ్లిద్దరినీ కలిపితే ఎంతటి స్థాయి ఉంటుందో, అంతకుమించి ఎదుగుతాడు. అందుకే అతడిని ఎలా మేనేజ్ చేస్తున్నారనేది చాలా ముఖ్యం. అతడిని జాగ్రత్తగా చూసుకోవాలి. ఎందుకంటే గొప్ప బాధ్యతతోనే గొప్ప ప్రతిఫలం వస్తుంది. ఒకవేళ సరిగ్గా చూసుకోకపోతే, ఏదో ఒక దశలో అతడిని కోల్పోయే ప్రమాదం ఉంది" అని స్టెయిన్ పేర్కొన్నాడు.
ప్రస్తుత క్రికెట్‌లో వైభవ్‌ను అత్యంత ప్రమాదకర బ్యాటర్‌గా మార్చిన అంశాలను కూడా స్టెయిన్ విశ్లేషించాడు. "అతను ఒక అద్భుతమైన బాల్ స్ట్రైకర్. భారత్‌లో మంచి వికెట్లపై ఆడటాన్ని నేను గమనించాను. అక్కడి మైదానాలు కూడా కొంచెం చిన్నవిగా ఉంటాయి. ఈ పరిస్థితులను అతను చక్కగా ఉపయోగించుకున్నాడు" అని తెలిపాడు. అయితే, బౌలర్లు ఈ లెఫ్ట్ హ్యాండర్ బ్యాటర్‌లో కొంచెం 'భయం' సృష్టించగలిగితే అతడిని కట్టడి చేయవచ్చని స్టెయిన్ అభిప్రాయపడ్డాడు. "రబాడ అతనికి బాగా బౌలింగ్ చేశాడు. వైభవ్‌కు ఇంకా 15 ఏళ్లే. కాబట్టి ఆటలో కొద్దిగా భయాన్ని జోడించాలి. అతనికి షార్ట్ బాల్స్ వేయడం ఒక మంచి ఆప్షన్" అని సూచించాడు.
ఇదే సమయంలో కొత్త తరం ఆటగాళ్లు వస్తున్నా తన స్థానాన్ని పదిలంగా నిలబెట్టుకుంటున్న 37 ఏళ్ల విరాట్ కోహ్లీని కూడా స్టెయిన్ ప్రశంసించాడు. "కోహ్లీ మానసిక దృఢత్వం, ఆటలో నిలకడగా రాణించాలనే తపన అద్భుతం. తనలో అపారమైన స్వయం ప్రేరణ ఉంది. నా తరంలోని క్రికెటర్లలో మాకు ఉన్నది కూడా అదే" అని అన్నాడు. టీ20 క్రికెట్‌లో బౌలర్లు రాణించడంపై మాట్లాడుతూ, ఆఫ్ఘనిస్థాన్ బౌలర్ ఫజల్‌హక్ ఫరూఖీని ఉదాహరణగా చూపాడు. ఎన్నో నైపుణ్యాలు ఉన్నా, ఏ బంతిని ఎప్పుడు, ఎలా వేయాలో తెలిసినప్పుడే బౌలర్ విజయవంతం అవుతాడని, లేకపోతే గందరగోళానికి గురయ్యే ప్రమాదం ఉందని స్టెయిన్ బౌలర్లకు కీలక సలహా ఇచ్చాడు.




## ప్రపంచకప్ గెలవాలంటే రోహిత్, కోహ్లీ కీలకం

- **ప్రపంచకప్‌లో భారత్‌కు రోహిత్, కోహ్లీ అనుభవం కీలకమన్న ఇర్ఫాన్ పఠాన్**
- **దక్షిణాఫ్రికాలో రోహిత్ షార్ట్‌పిచ్ బంతులను సమర్థంగా ఎదుర్కోగలడని విశ్లేషణ**
- **వన్డేల్లో ఇన్నింగ్స్‌ను నిర్మించడంలో కోహ్లీకి సాటే లేదని అభిప్రాయం**
- **వికెట్‌కీపర్‌గా కేఎల్ రాహుల్ తర్వాత ఇషాన్ కిషన్ బ్యాకప్ అని పేర్కొన్న పఠాన్**

**డిడి9 వార్త:**





దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచకప్‌లో భారత్ విజయావకాశాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అనుభవంపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటాయని మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో తొలి వన్డేకు ముందు మాట్లాడిన అతడు ఈ ఇద్దరు సీనియర్ బ్యాటర్లు జట్టుకు అందించే స్థిరత్వం, ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం విలువైనవని పేర్కొన్నాడు. ప్రపంచకప్ వంటి భారీ టోర్నీల్లో అనుభవజ్ఞుల పాత్ర ఎంత ముఖ్యమో భారత్ గతంలో పలుమార్లు చూసిందని గుర్తు చేశాడు. రోహిత్ శర్మ గురించి మాట్లాడిన పఠాన్, అతని షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కొనే నైపుణ్యాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించాడు. దక్షిణాఫ్రికా పిచ్‌లపై వేగం, బౌన్స్ ఎక్కువగా ఉంటాయని, అలాంటి పరిస్థితుల్లో రోహిత్ వంటి బ్యాటర్ ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం చెలాయించగలడని అన్నాడు. బాల్ లెంగ్త్‌ను ముందుగానే అంచనా వేసి ఆడే అతని సామర్థ్యం భారత జట్టుకు పెద్ద బలమని వివరించాడు.విరాట్ కోహ్లీ విషయానికి వస్తే వన్డే క్రికెట్‌లో అతని స్థిరత్వానికి సాటే లేదని పఠాన్ పేర్కొన్నాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే కోహ్లీ తొలి వికెట్ త్వరగా పడినప్పుడు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దగలడని చెప్పాడు. భారీ లక్ష్యాల ఛేదనలో కోహ్లీ ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడని వివరించాడు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడే అతని స్వభావం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపాడు. ప్రపంచకప్ గెలవాలంటే రోహిత్ దూకుడు, కోహ్లీ నిలకడ రెండూ భారత్‌కు తప్పనిసరిగా అవసరమని స్పష్టం చేశాడు.
ఇక వికెట్‌కీపర్ బ్యాటర్ల ఎంపికపై కూడా పఠాన్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. వన్డేల్లో కేఎల్ రాహుల్ భారత జట్టు తొలి ఎంపిక వికెట్‌కీపర్ బ్యాటర్ అని చెప్పాడు. ఐదు, ఆరు స్థానాల్లో అతను జట్టుకు బ్యాలెన్స్‌ను అందించగలడని వివరించాడు. బ్యాకప్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేయడం సరైన నిర్ణయమని తెలిపాడు. ఫాస్ట్ బౌలింగ్‌ను ఎదుర్కొనే సామర్థ్యం అతనికి ఉందని తెలిపాడు. అలాగే అవకాశం వచ్చిన ప్రతిసారీ సత్తా చాటిన సంజూ శాంసన్‌ను కూడా పరిశీలించొచ్చని సూచించాడు.

## 90 నిమిషాల ఆట.. వేల కోట్ల సంపాదన.. ఇది క్రిస్టియానో రొనాల్డో లెక్క!

- **ఒక్క మ్యాచ్ ఆడితే రొనాల్డో సంపాదన సుమారు 30 కోట్లు**
- **ఈ మొత్తం సంపాదించడానికి ఓ భారతీయ ఉద్యోగికి 2,500 ఏళ్లు**
- **సౌదీ క్లబ్‌తో ఒప్పందం ద్వారా రొనాల్డో వార్షిక ఆదాయం 1,700 కోట్లకు పైమాటే**
- **రొనాల్డో నికర ఆస్తి విలువ సుమారు 10,000 కోట్ల రూపాయలు**
- **ఈ సంపదను అందుకోవాలంటే ఏడాదికి 12 లక్షల జీతంతో 83,000 ఏళ్లు పనిచేయాలి**

**డిడి9 వార్త:**

ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం, పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోకు ఇక జీతం అనే మాట చిన్నదైపోయింది. అతను ఇప్పుడు సమయాన్ని శాసించే స్థాయిలో సంపాదిస్తున్నాడు. ఫుట్‌బాల్ మైదానంలో అడుగుపెట్టిన ప్రతిసారీ, కాలం అతని కోసం ప్రత్యేకంగా నడుస్తుంది. కేవలం 90 నిమిషాల ఆట అతనికి దాదాపు 30 కోట్ల రూపాయలు సంపాదించి పెడుతుంది. ఇదే మొత్తాన్ని ఏడాదికి 12 లక్షల రూపాయల జీతం తీసుకునే ఓ భారతీయ ఉద్యోగి సంపాదించాలంటే ఏకంగా 2,500 సంవత్సరాలు పడుతుంది.
ఎన్డీటీవీలో వచ్చిన కథనం ప్రకారం.. ఈ లెక్కలు ఎలా సాధ్యమో వివరంగా చూద్దాం. ప్రస్తుతం 41 ఏళ్ల వయసులో ఉన్న రొనాల్డో, సౌదీ అరేబియా క్లబ్ అల్ నసర్ తో చేసుకున్న ఒప్పందం ద్వారా ఏడాదికి సుమారు 200 మిలియన్ డాలర్లు ఆర్జిస్తున్నాడు. భారత కరెన్సీలో ఇది సుమారు 1,700 కోట్ల రూపాయలతో సమానం. ఒక ఫుట్‌బాల్ సీజన్‌లో క్లబ్, జాతీయ జట్టు తరఫున రొనాల్డో సగటున 55 మ్యాచ్‌లు ఆడతాడని అంచనా. ఈ లెక్కన అతని వార్షిక ఆదాయాన్ని మ్యాచ్‌ల సంఖ్యతో భాగిస్తే, ప్రతి మ్యాచ్‌కు అతని సంపాదన దాదాపు 30 కోట్ల రూపాయలని తేలుతుంది. అంటే.. 90 నిమిషాల ఆట, అదనపు సమయం కలిపి అతనికి వచ్చే ఆదాయం, మన దేశంలోని ఎన్నో కంపెనీలు తమ ఉద్యోగులందరికీ ఏడాది జీతాల కోసం కేటాయించే బడ్జెట్‌తో సమానం.
ఇది కేవలం అతని వార్షిక ఆదాయం మాత్రమే. ఇక అతని నికర ఆస్తి విలువ చూస్తే కళ్లు చెదరడం ఖాయం. ప్రస్తుతం రొనాల్డో ఆస్తి విలువ 1.2 బిలియన్ డాలర్లకు పైనే ఉంటుందని అంచనా. మన కరెన్సీలో చెప్పాలంటే ఇది సుమారు 10,000 కోట్ల రూపాయలు. రెండు దశాబ్దాలకు పైగా అగ్రశ్రేణి ఫుట్‌బాల్ ఆడటం, ఛాంపియన్స్ లీగ్ బోనస్‌లు, స్పాన్సర్‌షిప్ ఒప్పందాలు, ఇమేజ్ రైట్స్, సొంత వ్యాపారాలు, ప్రపంచంలోని ఎన్నో దేశాల జనాభా కంటే ఎక్కువ ఉన్న సోషల్ మీడియా ఫాలోయింగ్‌ను ఆదాయంగా మార్చుకోవడం ద్వారా ఈ అపార సంపదను కూడబెట్టాడు. ఇప్పుడు ఈ 10,000 కోట్ల రూపాయల సంపదను, ఏడాదికి 12 లక్షలు సంపాదించే భారతీయ ఉద్యోగితో పోల్చి చూద్దాం. రొనాల్డో ఆస్తిని అందుకోవాలంటే.. ఆ ఉద్యోగికి దాదాపు 83,333 సంవత్సరాలు పడుతుంది. మరోలా చెప్పాలంటే.. ఒక వ్యక్తి తన 40 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఎంత సంపాదించినా అది రొనాల్డో సంపద ముందు సముద్రంలో నీటిబొట్టు లాంటిదే. దాదాపు 2,000కు పైగా ఉద్యోగ జీవితాలను పక్కపక్కన పెడితే గానీ ఆ సంపదను అందుకోలేరు. ఫుట్‌బాల్, గ్లామర్, ట్రోఫీలు, ఇన్‌స్టాగ్రామ్ ఫాలోయింగ్‌ను పక్కనపెట్టి కేవలం అంకెలను చూస్తే, అసలు కథ బోధపడుతుంది. ఆధునిక ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక వ్యక్తి 90 నిమిషాల సమయం, వేలాది మంది సంవత్సరాల తరబడి చేసే ఉద్యోగానికి సమానంగా నిలుస్తోంది. ఇదే క్రిస్టియానో రొనాల్డో సృష్టించిన ఆర్థిక అద్భుతం.



# ఫాలోయింగ్ అనేది కేవలం ఒక నంబర్ మాత్రమే..



స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే గత కొద్ది కాలంగా సోషల్ మీడియాలో తీవ్రమైన ట్రోలింగ్‌ను ఎదుర్కొంటోంది. ఆమె వరుసగా పెద్ద పెద్ద సినిమాలు చేస్తున్నప్పటికీ, బాక్సాఫీస్ దగ్గర ఆశించిన విజయాలు అందడం లేదు. ఇక ఇటీవల వచ్చిన హిందీ సినిమా హై జవానీ ఇష్క్ హోనా హై' కూడా పెద్దగా హిట్ అందుకోలేకపోయింది. దీంతో కొందరు నెటిజన్లు ఆమెను ఐరన్ లెగ్ అంటూ దారుణంగా ట్రోల్ చేయడం ప్రారంభించారు. ఇప్పటివరకు ఈ నెగెటివిటీపై మౌనంగా ఉన్న పూజా హెగ్డే, తాజాగా, ఈ విషయంపై ఘాటుగా రియాక్ట్ అయ్యింది. సోషల్ మీడియా క్రేజ్‌కు, సినిమా కలెక్షన్లకు అస్సలు సంబంధం ఉండదని స్పష్టం చేసింది. "నాకు సోషల్ మీడియాలో 30 మిలియన్ల కంటే ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారు. అంత మాత్రాన సినిమా థియేటర్లలో 30 కోట్ల టికెట్లు అమ్ముడవుతాయని గ్యారెంటీ లేదు. సోషల్ మీడియా ఫాలోయింగ్ అనేది కేవలం ఒక నంబర్ మాత్రమే. అది సినిమాల సక్సెస్‌ను డిసైడ్ చేయలేదు" అని పూజా తేల్చి చెప్పింది.

ఇండస్ట్రీలోని అసలైన స్టార్‌డమ్ గురించి చెబుతూ.. "సినిమా పరిశ్రమలో కొంతమంది నటులకు సోషల్ మీడియాలో కేవలం 5 మిలియన్ల మంది ఫాలోవర్లు మాత్రమే ఉంటారు. కానీ థియేటర్లలో వారి సినిమాలకు విపరీతమైన క్రేజ్ ఉంటుంది.

# బాలీవుడ్ స్టార్ బ్యూటీ రీ ఎంట్రీ.. ఫైనల్లీ క్లారిటీ ఇచ్చిన టీమ్

బాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా దూసుకుపోయిన కత్రినా కైఫ్.. పెళ్లి, వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇస్తూ సినిమాలకు దూరం అయింది. ఈ క్రమంలోనే ఈ అమ్మడు మళ్లీ వెండితెరకు ఇవ్వబోతున్నట్లు గత కొద్ది రోజులుగా ఓ వార్త వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె పలువురు దర్శకనిర్మాతలు చెబుతున్న కథలు వింటుందని, ఈసారి కేవలం కమర్షియల్ సినిమాలకే పరిమితం కాకుండా పాత్రకు ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్టులు ఎంపిక చేసుకుని స్ట్రాంగ్ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నది పలు పోస్టులు హల్ చల్ చేస్తున్నాయి. అంతే కాకుండా.. వెబ్ సిరీస్‌లు, డిజిటల్ ఒరిజినల్స్, మహిళా ప్రధాన కథలపై ఆమె ప్రత్యేక ఆసక్తి చూపుతున్నదని, ఇప్పటికే కొన్ని కథలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని బాలీవుడు వర్గాల నుంచి వార్తలు రాగా.. ఆమె ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు.

ఈ క్రమంలోనే కత్రినా రీ ఎంట్రీపై తాజాగా టీమ్ స్పందించి క్లారిటీ ఇచ్చింది. ఈ మేరకు 'కత్రినా కైఫ్ మళ్లీ సినిమాల్లోకి వస్తుంది అని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ఆమె తన ప్రాధాన్య ప్రస్తుతం మదర్‌హుడ్‌కే పరిమితం చేశారు. ఓటీటీ ఆఫర్ల వార్తల్లో కూడా ఎలాంటి నిజం లేదు. అవన్నీ పుకార్లు మాత్రమే. ఆమె సిల్వర్ స్క్రీన్‌కు ఎంట్రీ ఇవ్వడానికి ఇంకాస్త టైమ్ ఉంది' అంటూ తెలిపారు. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన పోస్టులు నెట్టింట వైరల్ అవుతుండగా.. కత్రినా నిజంగా ఎంట్రీ ఇస్తుందని ఆశపడిన ఫ్యాన్స్ నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.





# సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లో ప్రియదర్శి క్రేజీ ప్రాజెక్ట్..!

ప్రియదర్శి 'మల్లేశం' సినిమాతో హీరోగా మారి, ఆ తర్వాత వచ్చిన 'బలగం' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఆ మధ్య కొన్ని సినిమాలు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయినా.. గత ఏడాది విడుదలైన 'కోర్ట్' మూవీతో ప్రియదర్శి మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించడమే కాకుండా భారీ కలెక్షన్లను రాబట్టింది. అదే జోష్‌లో ఆయన నటించిన 'సుయోధన' సినిమా కూడా ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. ప్రస్తుతం ప్రియదర్శి సూపర్ హిట్ వెబ్ సిరీస్ 'సేవ్ ది టైగర్స్3' షూటింగ్ పనుల్లో ఫుల్ బిజీగా గడుపుతున్నాడు. ఇదిలా ఉంటే, ప్రియదర్శి కెరీర్‌కు సంబంధించి సోషల్ మీడియాలో ఒక క్రేజీ న్యూస్ తెగ వైరల్ అవుతోంది. టాలీవుడ్ టాప్ డైరెక్టర్ సుకుమార్ కి చెందిన సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై ప్రియదర్శి ఒక కొత్త సినిమా చేయబోతున్నట్లు నెట్టింట పలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. ఈ విభిన్నమైన చిత్రాన్ని ప్రముఖ నిర్మాత బన్నీ వాసు నిర్మించనున్నట్లు తెలుస్తోంది. కానీ దర్శకుడు ఎవరనే దానిపై మాత్రం సస్పెన్స్ నెలకొంది. మంచి కంటెంట్ ఉన్న కథలను ఎంకరేజ్ చేసే సుకుమార్ బ్యానర్‌లో, సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాసు నిర్మాణంలో ప్రియదర్శి సినిమా అంటే ఖచ్చితంగా ఇదొక ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ అవుతుందని నెటిజన్లు భావిస్తున్నారు. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# ఎన్టీఆర్ లైనప్‌లో ఊహించని ట్విస్ట్..

టాలీవుడ్‌లో ప్రస్తుతం యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ లైనప్ సాలిడ్‌గా ఉంది. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో డ్రాగన్ సినిమా చేస్తున్నాడు ఎన్టీఆర్. ఇదిలా ఉండగా ఎన్టీఆర్ నెక్స్ట్ చిత్రాలకు సంబంధించిన అప్‌డేట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కోలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో ఎన్టీఆర్ ఒక భారీ సినిమా చేయబోతున్నారనే వార్త గత కొంతకాలంగా ఫిల్మ్ నగర్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్ కాస్త డిలే అయ్యేలా ఉందని తెలుస్తుంది. తాజా సమాచారం ప్రకారం ఎన్టీఆర్ – నెల్సన్ కాంబినేషన్ మూవీ పట్టాలెక్కడానికి చాలా ఎక్కువ సమయం పట్టేలా కనిపిస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఏకంగా 2028వ సంవత్సరానికి వాయిదా పడే అవకాశం ఉందని ఇండస్ట్రీ టాక్. ప్రస్తుతం 'జైలర్ 2' చిత్రంతో బిజీగా ఉన్న నెల్సన్.. ఆ తర్వాత కోలీవుడ్ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌గా భావిస్తున్న సూపర్ స్టార్ రజనీకాంత్, ఉలగనాయగన్ కమల్ హాసన్‌లతో ఒక రేర్ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారట. మరోవైపు ఎన్టీఆర్ కూడా తన ముందస్తు కమిట్మెంట్స్ పూర్తి చేసే పనిలో ఉన్నారు. 'డ్రాగన్' షూటింగ్ పూర్తయిన వెంటనే, ఎన్టీఆర్ మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో 'గాడ్ ఆఫ్ వార్' సినిమా చేయబోతున్నాడు. 'డ్రాగన్' ముగిసిన తర్వాత ఎన్టీఆర్ – త్రివిక్రమ్ ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్లే గ్యాప్‌లో.. ఇటు నెల్సన్ కూడా రజనీ – కమల్ హాసన్ మల్టీస్టారర్ మూవీని పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారట. ఈ రెండు భారీ చిత్రాలు పూర్తవడానికి కనీసం రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. ఈ సమీకరణాల వల్లే ఎన్టీఆర్ – నెల్సన్ కాంబో 2028లోనే పట్టాలెక్కే ఛాన్స్ ఉందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# గోపీచంద్ సినిమాతో మెగా ఫోన్ పట్టుకున్న యాక్షన్ కొరియోగ్రాఫర్!




టాలీవుడ్‌లో పవర్‌ఫుల్ యాక్షన్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే మ్యాచో స్టార్ గోపీచంద్ ఈ రోజు తన బర్త్ డేని సెలబ్రేట్ చేసుకుంటున్నారు. ఈ హీరో బర్త్ డే సందర్భంగా ఆయన కొత్త సినిమా టైటిల్‌ను మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు 'సింగ' (SINGA) అనే ఇంట్రెస్టింగ్ అండ్ పవర్‌ఫుల్ టైటిల్‌ను మేకర్స్ ఫిక్స్ చేశారు. గోపీచంద్ హీరోగా 70ఎమ్ఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ భారీ చిత్రం రూపుదిద్దుకుంటోంది. టాలీవుడ్‌లో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలకు అదిరిపోయే స్టంట్ సీక్వెన్సులు అందించిన ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ వి.వెంకట్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆయనే ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే అందించడం విశేషం. టైటిల్‌కు తగ్గట్టే గోపీచంద్ మార్క్ హైవోల్టేజ్ రా అండ్ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండబోతోందని తాజాగా రిలీజ్ అయిన టైటిల్ గ్లింప్స్‌లో తెలుస్తోంది.

ఈ సినిమాలో గోపీచంద్ సరసన యంగ్ అండ్ బ్యూటిఫుల్ యాక్ట్రెస్ అనార్కలి నాజర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రానికి టాలెంటెడ్ కంపోజర్ సామ్ సీఎస్ మ్యూజిక్ అందిస్తున్నారు. వైవిధ్యమైన చిత్రాలను నిర్మించిన విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. యాక్షన్ డైరెక్టర్ వెంకట్ మెగాఫోన్ పడుతుండటం, గోపీచంద్ కంప్లీట్ మాస్ అవతారంలో నటిస్తుండటంతో ఈ 'సింగ' ప్రాజెక్ట్‌పై ట్రేడ్ వర్గాల్లో ఇప్పుడే మంచి అంచనాలు క్రియేట్ అయ్యాయి.

# 'ఆదర్శకుటుంబం' సినిమా రిలీజ్‌పై బిగ్ అప్డేట్!

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ డైరెక్షన్‌లో రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్ చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47'. విక్టరీ వెంకటేష్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ క్రమంలోనే ఈ మూవీ రిలీజ్‌పై ఇంట్రెస్టింగ్ బజ్ నెట్టింట సందడి చేస్తుంది. ఈ మూవీకి సంబంధించి ఇంకో 25, 30 రోజుల్లో టోటల్ షూట్ కంప్లీట్ అవ్వనుందని ఫిలిమ్ వర్గాల నుంచి టాక్. అంతే కాకుండా.. షూట్ కంప్లీట్ చేసుకున్న అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో వేగం పెంచి, ప్రమోషన్స్ స్టార్ట్ చేసి అక్టోబర్‌లో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారట. దీనిపై త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు వినికిడి.



ఇదిలా ఉంటే.. ఆదర్శ కుటుంబం ఇంటర్వెల్ బాంగ్ & క్లైమాక్స్ యాక్షన్ ఎపిసోడ్స్ మేజర్ హైలెట్స్ అని టాక్. అలాగే ప్రీక్లైమాక్స్‌లో వచ్చే ఒక 'ట్రైన్ ఎపిసోడ్' సినిమాకే హైలైట్ అని ఇండస్ట్రీ టాక్ వినిపిస్తుండగా.. ఈ సినిమాపై రోజు రోజుకు ఎక్స్‌పెక్టేషన్స్ పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలోనే రిలీజ్ డేట్‌పై అప్డేట్ రావడంతో.. విడుదల కోసం ఈగర్‌గా వెయిటింగ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు వెంకటేష్ ఫ్యాన్స్.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500131. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502513.